/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి
సోమవారం
10-07-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 185
పేజీలు : 8

AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

ఆషాఢ మాసం, సోమవారం, తిథి : అష్టమి సా.06.44 వరకు, నక్షత్రం: రేవతి, సా :06.59 వరకు, వర్జ్యం: మ.03.03-04.40 వరకు, దుర్ముహూర్తం: మ.12.47-01.39 వరకు, రాహుకాలం: సా.07.29-09.06 వరకు



## అమర్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం..!

భక్తులు హిమలింగానికి పూజలు చేసేందుకు అనుమతి

వివరాలు.. 5లో



## వర్ష బీభత్సం

ఢిల్లీపై వరుణుడి ప్రతాపం

స్కూళ్లకు సెలవు.. రోడ్లకు భారీ గుంత

కొట్టుకుపోయిన కార్లు.. వంతెనలు..!



## ముద్రగడ వైపు వైసీపీ చూపు..

2

ఏపీ రాజకీయాల్లో సంచలనం..

# అంతర్జాతీయ మ్యాప్‌లోకి గండికోట




### గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం : సీఎం జగన్

గండికోట, తిరుపతి, విశాఖపట్నంలలో ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్

విశాఖ, తిరుపతి ఒబెరాయ్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం

జులై 15 తర్వాత అన్ని రకాల అనుమతులు

50 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో ఒబెరాయ్ హోటల్ నిర్మాణం

నేడు కొప్పర్తిలో డిక్సన్ పరిశ్రమ ప్రారంభం

ఛానెల్ ప్లే, టెక్నో ఇండియా కంపెనీలతో కడపలో ఎంవోయూ కుదుర్చుకుంటాం: సీఎం

**వైయస్‌ఆర్ జిల్లా, జూలై 9 (మనం న్యూస్):**

గండికోటను ప్రపంచానికి పరిచయం చేయబోతున్నామని, ఒబెరాయ్ వంటి పెద్ద కంపెనీలు గండికోటలో స్టార్ హోటల్ ఏర్పాటు హర్షణీయం అని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైయస్‌ఆర్ జిల్లా గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఒబెరాయ్ హోటల్స్ ఎండీ, సీఈవో విక్రమ్ ఒబెరాయ్ పాల్గొన్నారు. అనంతరం విశాఖ, తిరుపతి ఒబెరాయ్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ఆయన సభలో సీఎం జగన్ మాట్లాతూ.. దేవుడి దయతో జమ్ములమడుగు నియోజకవర్గంలో మరో మంచి కార్యక్రమం జరుగుతుంది. ఈ రోజు ..మిగతా 2లో





## ముదిరిన వివాదం

ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య వివాదం

గవర్నర్ రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

గవర్నర్‌పై సీఎం తీవ్ర ఆరోపణలు!

వివరాలు.. 5లో



## ఘోర రోడ్డు ప్రమాదం

మిట్టకంద్రిగ వద్ద కారు, లారీ ఢీ

ఆరుగురు దుర్మరణం

ఈ ఘటనలో మృతులంతా కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు

వివరాలు.. 4లో

# నేను ప్రజల కోసమే వచ్చా

పోరాటానికి సిద్ధపడి రాజకీయాల్లోకి వచ్చా

నేను రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడుతుంటే..

వైసీపీ నాయకులు నా ఇంట్లో ఆడవారి గురించి మాట్లాడి అవమానిస్తున్నారు

ఎందుకు ఇన్ని దెబ్బలు, అవమానాలు పడాలి?

చనిపోవడానికి సిద్ధపడి రాజకీయాలు చేస్తున్నా

డబ్బుతో పాలన చేసే వ్యక్తి కేవలం జవాబుదారీ మాత్రమే..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

పొత్తులపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు..

జనసైనికులకు సూచనలు




**ఏలూరు, జూలై 9 (మనం న్యూస్):** ఏలూరులోని పాత బస్టాండ్ వద్ద తన వారాహి యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వారాహి 2వ దశ విజయ యాత్రకు ఏలూరులో ఇంత ఘన స్వాగతం లభిస్తుంది అనుకోలేదు, దారిపొడవునా అక్కాచెల్లెళ్ళు, తల్లులు ప్రేమాభిమానాలు చూపించారని అన్నారు. హల్లో ఏపీ - బైబై వైసీపీ అనే నినాదం చాలా నలిగిపోయి, ప్రజలు బాధలు పడ్డాక ..మిగతా 2లో



## టార్గెట్ @ 170

దక్షిణాదిలోనూ దంచికొట్టాలి!

సరికొత్త వ్యూహంతో బీజేపీ..

జేపీ నడ్డా అధ్యక్షతన

11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల సమావేశం

**హైదరాబాద్/ అమరావతి, జూలై 9 (మనం న్యూస్):** దక్షిణాదిపై ఫోకస్ పెట్టిన బీజేపీ హైదరాబాద్‌లో కీలక సమావేశం నిర్వహించింది. ఈ కీలక మీటింగ్ సౌతిండియా బీజేపీ ముఖ్యనేతలంతా హాజరయ్యారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అండ మాన్ నికోబార్, లక్షద్వీప్ నుంచి పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మెయిన్ లీడర్స్ అటెండ్ అయ్యారు. దక్షిణాదిలో బీజేపీ బలోపేతమే లక్ష్యం.. హైదరాబాద్ మీటింగ్ అజెండా ఇదే.. ఈ సింగిల్ పాయింట్ అజెండాతోనే సమావేశం జరిగింది. పార్టీని ఎలా బలోపేతం చేయాలి? అధికారం దక్కించుకోవడానికి ఏం చేయాలి? ..మిగతా 2లో



## వైసీపీ పతనం ప్రారంభమైంది

అరాచక పాలనను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధం

టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోతో వైసీపీ పతనం : టీడీపీ నేతలు

**విజయవాడ, జూలై 9 (మనం న్యూస్):** వైసీపీ పాలన పట్ల ప్రజలు విసుగెత్తిపోయారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. అరాచక పాలనను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రజలు ..మిగతా 2లో

## ముందస్తు ఎన్నికలు ఉండవు..



ముద్రగడ పద్మనాభం వైసీపీలోకి వస్తానంటే స్వాగతిస్తాం

ప్రజలను రెచ్చగొట్టి, లబ్ది పొందాలని పవన్ చూస్తున్నారు

తనకు బలం లేదని పవన్ కల్యాణే ఒప్పుకున్నారు

ఎంపీ మిథున్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

2



## వైయస్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించిన సీఎం

2

## అగ్నిపథ్ పథకంపై కేంద్రం కీలక నిర్ణయం..

స్కీమ్‌లో కీలక మార్పులు!

5

### మంచిమాట

అందరూ మనవాళ్లే అనుకో తప్పలేదు.. కానీ అందరూ మనలాంటి మనస్తత్వం కలవారే అని అనుకుంటే పొరపాటు..!

శుభోదయం

## ముద్రగడ వైపు వైసీపీ చూపు..

అమరావతి, జూలై 9 (మనం న్యూస్): ముద్రగడ పద్మనాభం.. కాపు ఉద్యమ నేత, సీనియర్ పొలిటీషియన్, ప్రస్తుతం ఏ పార్టీలో లేరు, కానీ ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై హాట్ కామెంట్స్ చేసి కాక పుట్టించారు. వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి సపోర్టుగా పవన్‌పై నిప్పులు చెరిగారు ముద్రగడ. దమ్ముంటే తనపై పిఠాపురం నుంచి పోటీ చేయాలని పవన్‌కు సవాల్ విసిరారు. దాంతో ముద్రగడ పద్మనాభం మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి రావడం ఖాయమనే గట్టిగా వినిపిస్తున్నాయి. ఇక అదే సమయంలో జనసేన నుంచి కూడా ముద్రగడపై గట్టిగా కౌంటర్లు పడ్డాయి. వైసీపీ నుంచి పోటీ చేసేటట్లయితే వెంటనే టిక్కెట్ అనౌన్స్ చేయించుకోవాలని జనసేన ప్రతిసవాల్ విసిరింది. ఇక కొన్ని రోజులుగా సైలెంట్‌గా ఉంటున్న ముద్రగడ వచ్చే ఎన్నికల్లో రంగంలోకి దిగేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారా..? లేక కాపులు ఏ పార్టీకి సపోర్ట్ చేయాలో తన అనుచరులతో చర్చిస్తున్నారా..? ఆయన ఏ పార్టీలో చేరబోతున్నారు..? వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. మరోవైపు అటు వైసీపీ కూడా ముద్రగడపై స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తోంది. ముద్రగడ మాటలు కూడా అలాగే కనిపిస్తున్నాయ్. వైసీపీ లీడర్స్ నుంచి ముద్రగడపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ముద్రగడ గొప్ప నాయకుడు, సీనియర్ పొలిటీషియన్ అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.ఇవన్నీ చూస్తుంటే ముద్రగడ వైసీపీలో చేరతారేమోనన్న అనుమానాలు రేగుతున్నాయ్. అందుకు తగ్గట్టే వైసీపీ లీడర్స్ కామెంట్స్ కూడా ఉంటున్నాయ్. గతనెల 9న కిర్లంపూడిలో ముద్రగడ ఇంటికెళ్లి మరీ కలిశారు వైసీపీ నేతలు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు కలిసి.. ముద్రగడతో చర్చలు జరిపారు. ఏం మాట్లాడారో తెలియదు గానీ, ఇప్పుడు మరో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కీలక కామెంట్స్ చేశారు. అయితే, వైసీపీ ఆఫర్‌కు ముద్రగడ నుంచి నో కామెంట్ అంటూ రియాక్షన్ వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతానికి అలాంటి ఆలోచనేమీ లేదంటూ ముద్రగడ చెప్పినట్టు తెలిసింది.

## వైసీపీ పతనం ప్రారంభమైంది

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధమవుతున్నారని చెప్పారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో టీడీపీ 'భవిష్యత్తుకు గ్యారెంటీ' చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల ఆస్తులు ఎలా కూల్చాలనే ఆలోచిస్తోంది తప్ప.. ప్రజలకు ఏమి చెయ్యాలో ఆలోచించడం లేదని టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆక్షేపించారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోతో వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. రాజమండ్రి మహానాడులో ప్రకటించిన మేనిఫెస్టో 'ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ' అని దానినే ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎన్.రఘురామ్ స్పష్టంచేశారు. వైసీపీను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. జగన్ పాలనపై ప్రజలు విసుగుచెందారని తెలిపారు. మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్లో తెలుగుదేశం నాయకులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించిన సీఎం

వైయస్ఆర్ జిల్లా, జూలై 9 (మనం న్యూస్): పులివెందులలో నూతనంగా రూ.26.12కోట్లతో నిర్మించిన వైయస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో రెండవ హాకీ టర్ఫ్ కోర్టును సీఎం వైయస్ జగన్ ప్రారంభించారు. ఈ అకాడమీలో హాకీ టర్ఫ్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, ఆర్చరీ బ్లాక్, హ్యాండ్ బాల్, ఖో ఖో, ఇండోర్ బ్యాట్ మింటన్ కోర్టులు ఉన్నాయి. అలాగే పులివెందులలో ఇస్టా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సీఎం వైయస్ జగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి అంజాద్ భాషా, ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మ్యాప్‌లోకి గండికోట

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క వైయస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోనే కాకుండా విశాఖపట్నం, తిరుపతితో కలిపి మూడు చోట్ల కూడా శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కడప జిల్లా, జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇవాళ జరుగుతున్న కార్యక్రమం ప్రతిష్టాత్మకమైనది. మనం గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిల్చుకునే మన గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. ఇవాళ ఒబరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకి వచ్చి, సూపర్ లగ్జరీ సెవన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతుంది. ఇలాంటి పెద్ద పెద్ద గ్రూపులు వచ్చి ఇలాంటి హోటల్స్ కడితే.. గండికోటని గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి తీసుకొనిపోగలుగుతాం. ఇటు గండికోటతో పాటు అటు తిరుపతి, విశాఖపట్నంలో కూడా ఇలాంటి హోటల్స్ వస్తున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల కడప జిల్లా, గండికోట రెండూ అంతర్జాతీయ మ్యాప్లో చోటు దక్కించుకుంటున్నాయి. కడప జిల్లాలో గతంలో ఇదే జమ్మలమడుగు నియోజకవర్గంలో.. స్టీల్ ఫ్యాక్టరీ రావాలని కలలు కన్నాం. మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు రావాలని దశాబ్దాలుగా కన్న కలను నిజం చేస్తూ... గతేడాది జిందాల్ గ్రూపుతో కలిసి.. ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఆ ప్రాజెక్టుకు సంబంధించి.. వైయస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఈ జూలైలో ఎన్విరానిమెంటల్ క్లియరెన్స్ వస్తుంది. దాని తర్వాత ఇప్పుడు కడుతున్న వేగం కన్నా యుద్ధప్రాతిపదికన అక్కడ కూడా పనులు రెట్టించిన వేగంతో జరుగుతాయి. ఇక్కడ ఒబరాయ్ హోటల్ రావడం వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఈ ఒబరాయ్ ప్రాజెక్టు అనేది మిగిలిన ప్రాజెక్టులు రావడానికి ఒక లంగరు వలె ఉపయోగపడుతుంది. ఈ గండికోటలో ఇలాంటి గ్రూపు ప్రాజెక్టులు రావడానికి ఇంకా అవకాశం ఉంది. కనీసం ఒబరాయ్ లాంటి ఇంకో గ్రూపుని తీసుకొచ్చే కార్యక్రమం కూడా ముమ్మరంగా చేస్తాం.



కాసేపటి క్రితం విక్రమ్ ఒబరాయ్ గారితో మాట్లాడుతూ.. ఇక్కడ గోల్ఫ్ కోర్ట్ పెట్టే ఆలోచన చేస్తే.. హోటల్కు మంచిది. ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయి. ఈ హోటల్ను ఒక గోల్ఫ్ రిసార్ట్గా దేశానికి, ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాలు ఉంటాయని చెప్పాను. ఆ దిశగా అడుగులు వేసేలా ఆలోచన చేస్తామని చెప్పారు. నేడు కొప్పర్తిలో డిక్సన్ కంపెనీకు సంబంధించి ప్రారంభోత్సవం చేస్తున్నాం. కొప్పర్తిలో డిక్సన్ గ్రూపు 1000పైగా ఉద్యోగాలు ఇచ్చారు. మరో రెండు నెలల్లో ఇంకో 1000 ఉద్యోగాలు రాబోతున్నాయి. ఛానల్ ప్లే అనే మరో కంపెనీ... హోం ఆడియో సిస్టమ్స్ తయారు చేస్తుంది. నేడు కొప్పర్తిలో ఆ కంపెనీతో ఎంఓయూపై సంతకాలు చేయనున్నాం. ఈ కంపెనీ ద్వారా 150 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఇక రెండోది ఎల్ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ ప్రొడకట్స్ తయారు చేసే టెక్నో డామ్ ఇండియా అనే మరో కంపెనీతో కూడా నేడు ఎంఓయూ చేయబోతున్నాం. ఈ కంపెనీ ద్వారా మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. కడప జిల్లాకు ఇంకా మంచి చేయాల్సిన అవసరం, మంచి జరిగే రోజులు చాలా ఉన్నాయి. ఇవన్నీ దేవుడి దయ, మీ చల్లని ఆశీస్సులతో రాబోయే రోజుల్లో ఇంకా మెరుగ్గా చేసే పరిస్థితులు, అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమానికి ఇక్కడికి వచ్చిన విక్రమ్ ఒబరాయ్‌గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అదే విధంగా ఇక్కడ ప్రాజెక్టు రావడానికి శాయశక్తులా కృషి చేసిన చీఫ్ సెక్రటరీ నుంచి పర్యాటక శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సహా ప్రతి ప్రభుత్వ అధికారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీ అందరి సహకారం ఈ ప్రాజెక్టుకు చాలా అవసరం. ఈ కంపనీ మన గురించి గొప్పగా బయట మాట్లాడితే... ఇంకా నాలుగు కంపెనీలు ఇక్కడకు వచ్చే పరిస్థితి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. చిన్న చిన్న అంశాలున్నా.. వాటిని మాట్లాడుకుని పరిష్కరించుకోగలుగుతాం. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మనం ఎంత సహకారం అందిస్తే మన జిల్లా ప్రతిష్ట పెరిగి.. అంత ఎక్కువ పరిశ్రమలు మన జిల్లాకు వచ్చి పారిశ్రామిక వేత్తలు పెట్టుబడి పెడతారు. గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు స్థానికులకు కూడా ఉపాధి లభిస్తుందని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. గండికోటకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో ఒబెరాయ్ హోటల్ నిర్మాణం చేపట్టనున్నారు. జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని సీఎం జగన్ అన్నారు. జులై 15 తర్వాత అన్ని రకాల అనుమతులు వస్తాయన్నారు. గండికోటలో ఒబెరాయ్ సంస్థ గోల్ఫ్ కోర్టు పెట్టే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ''నేడు కొప్పర్తిలో డిక్సన్ పరిశ్రమ ప్రారంభించబోతున్నాం. ఛానెల్ ప్లే, టెక్నో ఇండియా కంపెనీలతో నేడు కడపలో ఎంవోయూ కుదుర్చుకుంటాం'' అని సీఎం తెలిపారు. శంకుస్థాపన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, సీఎస్ జవహర్రెడ్డి, పర్యాటకశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఒబెరాయ్ లగ్జరీ హోటల్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

తిరుపతి, జూలై 9, మనం న్యూస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా గండికోట నుండి ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ప్రతినిధులు విక్రమ్ ఒబెరాయ్, పర్యాటక శాఖ మంత్రి రోజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి తదితరులతో కలిసి వర్చువల్ విధానంలో వైజాగ్ మరియు తిరుపతి పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఒబెరాయ్ లక్జరీ హోటల్స్‌కు భూమి పూజా కార్యక్రమం నిర్వహించి శంఖుస్థాపన చేయగా తిరుపతి జిల్లా ఏపీ టూరిజం శాఖ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (పేరూరు-అలిపిరి రోడ్డు) దగ్గర సదరు హోటల్‌కు కేటాయించబడిన ప్రాంతం నుండి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలమ్, జెసి డికె బాలాజీతో మరియు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీమతి ఆర్కే రోజా వర్చువల్ గా కడప నుండి ప్రసంగిస్తూ పర్యాటక రంగంలో నూతన ఉత్తేజం నింపడం కొరకు,పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రైవేట్ రంగం వారిని ప్రోత్సహించడం కొరకు ఔత్సాహిక వేత్తలను ఆకర్షించేలా నూతన పర్యాటక పాలసీ 2020-25 లో భాగంగా లాంగ్ టర్మ్ లీజు ప్రాతిపదికన భూమిని కేటాయించడమే కాకుండా, నిబంధనల ప్రకారం రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్ మరియు నీటి సరఫరా మరియు ఇతర ప్రోత్సాహకాలను అందించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థాపకుల పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ తిరుపతి జిల్లాలో తొలిసారిగా సెవెన్ స్టార్ ఒబెరాయ్ లక్జరీ హోటల్ అందుబాటులోకి వచ్చేల కృషి చేసిన ముఖ్యమంత్రికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా తిరుపతి జిల్లా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి,శ్రీ కాళహస్తీశ్వర స్వామి తదితర ప్రముఖ పుణ్య క్షేత్రాలు కలిగిన టెంపుల్ టౌన్ అని ప్రతి రోజూ లక్ష మందికి పైగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని, పలు పర్యాటక ప్రదేశాలు గల తిరుపతి జిల్లాకు రాష్ట్రంలోని, దేశంలోని నలుమూలల నుండి పర్యాటకులే కాకుండా ప్రపంచ దేశాల నుండి కూడా పర్యాటకులు వస్తున్నారని, వారికి ఆతిథ్యం అందించడంలో, పలు యాత్రికులను ఆకర్షించడంలో ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ ఏర్పాటు తప్పకుండా సఫలీకృతం అవుతుందని తెలిపారు. తిరుపతి జిల్లా టెంపుల్ టౌన్ గా పుణ్య క్షేత్రాలు సందర్శించే భక్తులు రావడం, టూరిజం హబ్ గా ప్రపంచ నలుమూలల నుండి పర్యాటకులు రావడం, హెల్త్ ఇన్స్టిట్యూషన్ ఎస్వీ మెడికల్ కాలేజీ, బరడ్స్ హాస్పిటల్ విశిష్ట సేవలు అందిస్తోందని వైద్య సేవల కొరకు పలు ప్రాంతాల నుండి ప్రజలు రావడం, స్విమ్స్ క్యాన్సర్ ఆసుపత్రి, పద్మావతి చిన్న పిల్లల హృదయాలయ ఆసుపత్రి ద్వారా అత్యుత్తమ సేవలతో హెల్త్ హబ్ గా, ముఖ్యమంత్రి గారి చొరవతో పలు పెద్ద పరిశ్రమల ఏర్పాటుతో పరిశ్రమల హబ్ గా అవతరించిందని, ఏడు యూనివర్సిటీలు కలిగి, ఐజర్, ఐఐటి ఏర్పాటుతో విద్యా హబ్ గా ఈ విధంగా పలు రంగాలకు చెందిన ప్రజలను ఆకర్షించి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి దోహదం అవుతోందని ముఖ్యమంత్రికి కలెక్టర్ తెలిపారు. తిరుపతి జిల్లాలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు 20 ఎకరాలను సర్వే నం. 604/9 పేరూరు గ్రామ పరిధిలో, ఏపీ టూరిజం శాఖ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (పేరూరు – అలిపిరి రోడ్డు) సమీపంలో కేటాయించడం జరిగిందనీ, ఈ ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ నిర్మాణం లో భాగంగా 100 విలాసవంతమైన స్వతంత్ర విల్లాలు ఏర్పాటు కానున్నాయని, అలాగే మల్టీ కూజన్ వివిధ రకాల వంటకాలు, కాన్ఫరెన్స్ హాల్, బాంకెట్ హాల్, 24 గంటలు కాఫీ షాప్, స్విమ్మింగ్ పూల్, ఫిట్నెస్ సెంటర్, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ స్పా, సావనీర్ దుకాణాలు పచ్చని ఆరుబయలు, పార్కింగ్ లాంటి మరెన్నో అత్యాధునిక సదుపాయాలతో తిరుపతి జిల్లా ప్రజలకు, ప్రపంచ నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు, యాత్రికులకు అందుబాటులోకి రానున్నదని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి వలన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు. ప్రభుత్వం నుండి సదరు ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ ఏర్పాటుకు అందాల్సిన అన్ని అనుమతులు సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హర్షిత్ పేరూరు సర్పంచ్ కేశవులు, ఎంపీటీసీ చంద్ర మోహన్ జిల్లా పర్యాటకశాఖ ఆర్డి రమణ ప్రసాద్, ఎస్ఈ ఎస్పీడీసీఎల్ కృష్ణా రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, పర్యాటక కార్పొరేషన్ డివియం గిరిధర్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి, టూరిజం ఈఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు ఎన్నికలు ఉండవు..

కాకినాడ, జూలై 9 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు ఎన్నికలు రావొచ్చన్న ప్రచారానికి తాజాగా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి చెక్ పెట్టారు. తాము లోక్సభ ఎన్నికల షెడ్యూల్తోనే ఎన్నికలకు వెళతామని క్లారిటీ ఇస్తూ.. ముందస్తు ఎన్నికల ఉండవని పరోక్షంగా చెప్పేశారు. పార్లమెంట్, అసెంబ్లీ కలిపి ఎన్నికలు జరిగితేనే అడ్వాంటేజ్ అని చెప్పుకొచ్చారు. ఆదివారం మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం తమ వైసీపీలోకి వస్తానంటే, తప్పకుండా స్వాగతిస్తామని తెలిపారు. అయితే.. ముద్రగడ పైన సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లే వారికే.. ఈసారి ఎన్నికల్లో సీట్లు ఇస్తామన్నారు. వారే తమ పార్టీ అభ్యర్థులని కూడా తేల్చి చెప్పారు. వైసీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్న ఆయన.. ప్రజలతో ఎలాంటి దాపరికాలు లేకుండా ఉండాలనేదే తమ పార్టీ స్ట్రాటజీ అని చెప్పారు. అందుకే.. తమ వల్ల ఉపయోగం ఉంటేనే ఓటు వెయ్యమని సీఎం జగన్ అంటున్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై మిథున్ రెడ్డి విమర్శలు గుప్పించారు. టీడీపీతో పొత్తు ఆశయంలో భాగంగానే.. పవన్ మాట్లాడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఆ పార్టీకి ప్రయోజనం చేకూర్చాలన్నదే పవన్ ముఖ్య ఉద్దేశమని వ్యాఖ్యానించారు. తాను ముఖ్యమంత్రి కానని పవన్ గతంలోనే చెప్పారని, తనకు సీఎం అయ్యేంత బలం లేదని స్వయంగా పవనే చెప్పారని గుర్తు చేశారు. అందుకే.. చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలనే లక్ష్యంతో పవన్ పని చేస్తున్నారన్నారు. అభిమానులు, ప్రజలను రెచ్చగొట్టి, లబ్ది పొందాలని పవన్ చూస్తున్నారని ఆరోపించారు. జనసేన పార్టీ మొత్తం ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీపీతో పొత్తు ఆశయంలో భాగంగానే జనసేన నేత పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని వైఎస్సార్సీపీ మిథున్రెడ్డిఅన్నారు. ముఖ్యమంత్రిని కానని గతంలో పవన్ చెప్పారని, అంత బలం తనకు లేదని స్వయంగా పవన్ చెప్పిన వ్యాఖ్యల్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలతో నేరుగా ఎలాంటి దాపరికాలు లేకుండా ఉండాలనేదే తమ పార్టీ స్ట్రాటజీ అని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకే తమవల్ల ఉపయోగం ఉంటేనే ఓటు వెయ్యమని సీఎం జగన్ అంటున్నారని ఆయన పేర్కొన్నారు. వైఎస్ఆర్సీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు టాప్ ప్రయారిటీ ఉంటుందని మిథున్‌రెడ్డి అన్నారు.

## టార్గెట్ @ 170

(మొదటిపేజీ తరువాయి)

అనే అంశాలపైనే ప్రధానంగా చర్చించారు. మెయిన్‌గా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగింది. పార్టీ పరంగా దేశం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించిన బీజేపీ.. ఆయా ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది. ఇవాళ హైదరాబాద్లో జరిగిన మీటింగ్ సదరన్ జోన్కి సంబధించింది. సౌత్‌లోనే ఐదు రాష్ట్రాలతో పాటు ముంబై.. లక్షద్వీప్, పాండిచ్చేరి, గోవా నేతలు కూడా పాల్గొన్నారు. టార్గెట్ 170 ఇదీ ఎజెండా. దక్షిణాది రాష్ట్రాల్లో కనీసం 170 పార్లమెంట్ సీట్లు రావాలన్నది బీజేపీ లక్ష్యంగా తెలుస్తోంది. 2024 లోక్సభ ఎన్నికల్లో ఒకవేళ ఉత్తరాదిన సీట్లు తగ్గినా.. ఆ లోటును దక్షిణాదితో తీర్చుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. దీనికోసం ఎటువంటి యాక్షన్ ప్లాన్ రాసుకోవాలి.. ఏం చేస్తే పార్టీలో పునరుత్తేజం వస్తుంది.. కర్నాటక చేదు అనుభవం నుంచి క్యాడర్ని ఎలా బైటపడెయ్యాలి.. అనే అంశం ఈ భేటీలో చర్చకొచ్చింది. ఈ భేటీ ఎంత పకడ్బందీగా జరిగిందంటే.. మీటింగ్‌తో సంబంధం లేని నాయకుల్ని గాని, మీడియాను గానీ పరిసరాల్లోకే రానివ్వలేదు. ఇది చాలా రహస్య సమావేశం అంటూ మైకుల ముందు మాట్లాడకుండానే వెళ్లిపోయారు నేతలు. ఇదే మొదటిది కాదు.. ఇదే చివరిది కాదంటోంది బీజేపీ. ఇటువంటి రీజినల్ మీటింగ్స్ ఎన్నికల వరకూ తరచూ జరుగుతూనే ఉంటాయని, తద్వారా సౌత్లో పార్టీ చొచ్చుకు వెళ్లేలా చేయాలని ప్లాన్ చేస్తోంది.

### మహంకాళిని దర్శించుకున్న నడ్డా..

హైదరాబాద్‌లో పార్టీ సమావేశానికి వచ్చిన నడ్డా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తరువాత నోవాటెల్ హోటల్లో తెలంగాణ బీజేపీ సీనియర్ నేతలతో నడ్డా సమావేశమయ్యారు. ఇటీవలే రాష్ట్ర అధ్యక్షుల్ని మార్చేసి పార్టీ ప్రక్షాళన మొదలుపెట్టింది. ఇక ఇప్పుడు తెలంగాణ నుంచి బండి సంజయ్‌ను, ఏపీ నుంచి సోము వీర్రాజును బీజేపీ జాతీయ కార్యవర్గంలోకి తీసుకుంది. ఇప్పుడు, దక్షిణాది రాష్ట్రాల కీలక సమావేశాన్ని నిర్వహించడం ఆసక్తి రేపింది.

# నేను ప్రజల కోసమే వచ్చా..

(మొదటిపేజీ తరువాయి)

బయటకు వచ్చింది, ఇది నా నుండి వచ్చిన నినాదం కాదు, ఆంధ్ర రాష్ట్ర ప్రజల నుండి వచ్చిన నినాదం అని అన్నారు. నేను ఎందుకు ఇన్ని దెబ్బలు, అవమానాలు పడాలి? మీరు అభిమానించే హీరోను, సరదాగా రాజకీయాల్లోకి రాలేదు స్కూల్లో మహనీయుల గురించి చెప్పి, విలువలు నేర్పించి, బయట నేరగాళ్లు, విలువలు లేని వాళ్ళు పాలిస్తుంటే నచ్చలేదు, మీ భవిష్యత్తు కోసం పనిచేయాలి, అని గెలుపు వచ్చినా, ఓటమి వచ్చినా పర్లేదు అని పోరాటానికి సిద్ధపడి రాజకీయాల్లోకి వచ్చానని ఆయన అన్నారు. నేను రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడుతుంటే, వైసీపీ నాయకులు నా తల్లి గురించి, నా ఇంట్లో ఆడవారి గురించి, పిల్లల గురించి మాట్లాడుతున్నారు, అవమానిస్తున్నారని ఆయన అన్నారు. అందరికీ సమన్యాయం అనే అంబేద్కర్ గారి స్ఫూర్తి నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చిందన్న ఆయన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంచోడా, చెడ్డోడా అని చూడకుండా ఆ స్థానానికి నేను గౌరవించని, జగన్ రెడ్డి గారు అని గౌరవించాను ఈరోజు నుండి అంబేద్కర్ గారి సాక్షిగా జగన్ రెడ్డిని ఏకవచనంతో పిలుస్తాను, ఈ జగన్ ముఖ్యమంత్రి పదవికి అనర్హుడు అని పవన్ అన్నారు. వైఎస్ జగన్, వైసీపీ రాష్ట్రానికి సరైనది కాదని, 2024లో వైఎస్ జగన్, వైసీపీ రాష్ట్రానికి అవసరం లేదని,. ఇక్కడ ఉన్న పోలీస్ దగ్గర నుండి, యువతీ, యువకుల ఉద్యోగ సమస్యలు, ఆడపడుచుల రక్షణ, రోడ్ల సమస్య, గంజాయి సమస్యలు ఉన్నాయి, ఈరోజు వీటి గురించి మాట్లాడుతానని అన్నారు. మనం వైఎస్ జగన్, వైసీపీకి బానిసలు కాదు, ఆయన మనలో ఒకడు అంతే. మన అందరం టాక్సులు కడితే, ఆ డబ్బుతో పాలన చేసే వ్యక్తి, ఆయన కేవలం జవాబుదారీ మాత్రమే అని అన్నారు. నేను చనిపోవడానికి సిద్ధపడి రాజకీయాలు చేస్తున్నానని కుండబద్దలు కొట్టారు. మరోసారి తనని ఓడించినా సరే, జనసేన పోరాటం మాత్రం ఆగదని తేల్చి చెప్పారు. తన వెంట లక్షమంది వస్తారని కాదని, తాను ఒక్కడినే నిలబడతానని ఉద్ఘాటించారు. వైసీపీ, జగన్ అరాచకాలను ఆపాలంటే.. రాష్ట్రంలో ప్రభుత్వం మారాల్సిందేనని వ్యాఖ్యానించారు. మాట్లాడితే తాను హైదరాబాద్‌లో ఉంటానని చెప్తారని, మీలాగే దోచేసిన డబ్బు తన దగ్గర లేదని పేర్కొన్నారు. తాను కష్టపడి సంపాదించిన డబ్బులను కౌలు రైతులు ఇస్తున్నానని చెప్పారు. సీఎం జగన్ బయటికొస్తే.. మహారాణిలా పరదాలు కట్టించుకొని తిరుగుతారని పవన్ ఆరోపించారు. ఏ ప్రభుత్వమైనా పారదర్శకత ఉండాలన్నారు. దేశంలో టిక్టాక్ బ్యాన్ చేస్తే, చైనాలో ఫేస్బుక్ బ్యాన్ చేశారని.. కానీ జగన్ మాత్రం ఇక్కడ జీవోలు కనబడకుండా చేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతీ మూడు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు చనిపోతున్నారని.. రోడ్లు సరిగ్గా వేయకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చెత్త తొలగించే కార్మికులపై కూడా చెత్త ట్యాక్స్ వేసిన చెత్త సీఎం జగన్ అని విమర్శించారు. గెలుస్తావా? అని అందరూ తనని అడుగుతున్నారని.. గెలుస్తామా? లేదా? అనేది కాదని, పోరాటం చేయడమే లక్ష్యంగా తాను పని చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 29వేల మంది ఆడపడుచులు కనిపించకుండా.. వీళ్లపై జగన్ ఒక్క రివ్యూ కూడా పెట్టలేదని మండిపడ్డారు. వాలంటీర్స్ ఇచ్చే సమాచారం వల్ల రాష్ట్రంలో హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతోందని పవన్ సంచలన ఆరోపణలు గుప్పించారు. ఒంటరిగా ఉన్న మహిళల్ని టార్గెట్ చేసి, వారిని మానవ అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ఇందులో పెద్దల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వాలంటీర్ల ద్వారా ఏ ఇంట్లో ఎంతమంది ఉన్నారు? ఏం చేస్తున్నారు? అనే సమాచారాల్ని రాబట్టి.. కొంతమంది వైసీపీ నేతలు హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలందరూ కోట్లలో దోచుకుంటున్నారన్నారు. మద్యపానాన్ని నిషేదం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. ఇప్పుడు మద్యం అమ్మి భారీస్థాయిలో డబ్బు సంపాదిస్తున్నారని వ్యాఖ్యానించారు. మద్యం ద్వారా దోచేసిన డబ్బులతో.. రేపు రాబోయే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేస్తారని చెప్పుకొచ్చారు. తనకు రాజకీయాలు ఏమాత్రం అవసరం లేదని, కేవలం ప్రజల కోసమే వచ్చానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వైసీపీ నేతలు తనని వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కట్టే పన్నులు సరిగా ఖర్చు చేస్తున్నారా? లేదా? అనేది కాగ్ చూస్తోందని.. 21-22 ఏపీ నివేదిక చూస్తే 25 లోపాలను ఎత్తి ఎత్తిచూపిందని గుర్తు చేశారు. స్టేట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, రోడ్ కార్పొరేష్న రూ.22 వేల కోట్లు అప్పు తీసుకొచ్చి.. ఎక్కడా లెక్కలో చూపలేదన్నారు. రూ.1800 కోట్ల వైఎస్ఆర్ పెన్షన్లు, రూ.390కోట్లు గర్భిణీలకు ఇవ్వాల్సిన మందులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి డబ్బుల్ని సైతం దోచేశారని ఆరోపించారు.

### పార్టీలో సమన్వయ పరుచుకునే నాయకత్వం లేదు

పొత్తులపై పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు పవన్.. పోటీ ఒంటరిగానా ..? పొత్తు లోనా అనేది తేలడానికి చాలా సమయం ఉందని, పొత్తులు ఉంటాయో ఉండవో తేలే వరకు పార్టీలో ఎవరూ దాని గురించి మాట్లాడ వద్దని తెలిపారు. పొత్తులపై అధ్యయనం చేసి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని, వైసీపీని ఓడించడానికి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వను అని గతంలో పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అధ్యయనం చేశాకే పొత్తు లేదా ఒంటరి పోటీ తెలుస్తానన్నారు పవన్. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ అని అవివేకంతో మాట్లాడటం లేదని, అధికారంలోకి రావాలనే ఆశ ఎవరికి ఉండదు? అందరికి ఉంటుందన్నారు. నా సందేశం కొన్ని కోట్ల మంది ప్రజల్లోకి బలంగా వెళ్తోందని, అందులో లోపం లేదన్నారు. కానీ కింది స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకునే, పోరాట పటిమ, స్ఫూర్తి ఉన్న బలమైన నాయకత్వం జనసేనకు లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. నా పర్యటనల తర్వాత అక్కడ పరిస్థితులపై సర్వే చేయిస్తున్నామని, మెజార్టీ పేరుతో ఏసు క్రీస్తు ను శిలువ వేశారు, సోక్రటీస్ ను అదే మెజార్టీ పేరుతో చంపేశారన్నారు. ఏపీలో రూల్ ఆఫ్ లా నాశనం అయ్యిందన్నారు పవన్. ఇదిలా ఉంటే.. మహంకాళమ్మ చల్లగా చూడాలని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలు సందర్భంగా భక్తులందరికీ భక్తిపూర్వక శుభాకాంక్షలు తెలిపారు పవన్. ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలను తల్లి మహంకాళమ్మ ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

### పొత్తులపై పవన్ కీలక వ్యాఖ్యలు.. జనసైనికులకు సూచనలు

రాష్ట్రంలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. తాజాగా పొత్తుల విషయంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులకు సంబంధించిన నిర్ణయం ఇప్పటికిప్పుడే తీసుకునేది కాదని తెలిపారు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే ఎన్నికలకు ఒంటరిగా వెళ్లాలా లేక కలిసి వెళ్లాలా అనేది అందరి అభిప్రాయం తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. పొత్తులపై తమ నాయకులు ఎవరికి వారు వ్యక్తిగత అభిప్రాయాలు ప్రస్తావించొద్దని సూచించారు. అలాగే టీవీ డిబేట్లలో గాని మరెక్కడా కూడా పొత్తులకి సంబంధించిన అంశాలను ఎవరూ మాట్లాడవద్దని అన్నారు. ఒకవేళ ఎవరైన వీటికి సంబంధించిన అంశాలను మాట్లాడితే పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు ఉంటాయని తెలిపారు. జన సమూహాన్ని చూసి మితిమీరిని ఆత్మవిశ్వాసానికి పోవద్దని సూచించారు. అధికారం కావాలని ఎవరికి ఉండదని.. బలంగా పనిచేస్తే అధికారం అదే వస్తుందని పేర్కొన్నారు.ఎక్కడ సభ పెట్టిన చాలా మంది జనాలు వస్తున్నారని.. ఆ సమూహాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం అని తెలిపారు.

## తిరుపతిలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయండి



శ్రీకాళహస్తి, జూలై 09, మనం న్యూస్: శ్రీ కాళహస్తి పరిసర ప్రాంతాళలో గూగుల్ డేటా సెంటర్ను ఏర్పాటు చేయడంపై గూగుల్ ఇంజనీరింగ్ సీనియర్ డైరెక్టర్ రామ గోవింద రాజుతో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన రెడ్డి చర్చలు జరిపారు. వారు అమెరికా పర్యటన సందర్భంగా ఈప్రతి పాదన చేశారు.తిరుపతి ప్రాంతంలో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అందుకు సంబందించిన వీడియోని వారికి చూపిస్తూ వివరించారు. ఈ నెల 21వ తారీఖున తమ భారత పర్యటనలో ఈ విషయంపై చ ర్చిస్తా మని తెలియజేశారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూ దన్ రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలపారు.

## భాస్కర్, బన్నీలు లేని లోటు పూడ్చలేనిది

- సంవత్సరీకంలో పులివర్తి సుధారెడ్డి



తిరుపతి, జూలై 09, మనం న్యూస్ : చంద్రగిరికి చెందిన జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గంగపల్లి భాస్కర్, మండల తెలుగు యు వత అధ్యక్షుడు భాను ప్రకాష్ లేని లోటు పూడ్చలేనిదని తెలుగు దేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పే ర్కొన్నారు. ఆదివారం వారి యాడాది సంవత్సరీకం (విస్తరి) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలు, సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల పట్ల చిత్తశుద్ధితో పని చేసే వారని పులివర్తి సుధారెడ్డి అన్నారు. అలాంటి మంచి వ్యక్తులు లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని, వారి కుటుంబ సభ్యులకు మరింత శక్తి, మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

## టిడిపి రథ యాత్రకు బ్రహ్మరథం



రామసముద్రం, జూలై 09, మనం న్యూస్ : భవిష్యత్ కు గ్యారెంటీ పేరిట రామసముద్రం లో ఆదివారం టిడిపి చేపట్టిన బస్సు యాత్రకు పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు.మండలంలోని ఎటావాకిలి నుండి యాత్ర ప్రారంభం కాగా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య అతిధులకు ఘనస్వాగతం పలికారు. అక్కడినుండి ఎంబాడి,కె సి పల్లె,మినికి,నరసాపురం, దిన్ని పల్లె మీదుగా రామసముద్రం కు బస్సు యాత్ర కొనసాగింది. దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా పార్టీ జండాలు రెపరేపలాడాయి . సుమారు రెం డు వందల ద్విచక్ర వాహనాలతో కార్యకర్తలు ర్యాలీ నిర్వహిం చారు. కేసిపల్లెలో మధుసూదన్ రెడ్డి,మినికిలో శ్రీనాథ్ యాత్ర కు ఘన స్వాగతం పలికారు. నరసాపురంలో సుమారు 50 మంది వైసిపి నాయకులు టిడిపిలో చేరారు.వీరికి దొమ్మలపా టి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామసముద్రంలో అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన పంచాయతీ భావన నిర్మాణం అసంపూర్తిగా ఉండగా అక్కడ దొమ్మలపా టి రమేష్ ఛాలెంజ్ సెల్ఫీ దిగారు.అ నంతరం చెంబకురు మీదుగా బస్సు యాత్ర మదనపల్లెకు చేరుకుంది.

## గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం

బంగారుపాలెం, జూలై 09, మనం న్యూస్ : బంగారుపాలెం మండలంలోని గుంతురు గ్రామపంచాయతీ పరిధిలో భగవద్గీత పై మహిళలు పురుషులు ఇంటింటికి వెళ్లి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగురుపౌర్ణమి కి ఆరాధ్యుడు శ్రీ కృష్ణుడే :- టైమ్ఆషాఢ మాసం గురు పౌర్ణమి ని పుర స్కరించుకుని బంగారుపాళ్యం మండలంలోని గుంతుర్ గ్రామం యందు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమము నిర్వహించ డం జరిగింది.గురువు గుణాతీతుడు అలాగే రూపవర్జితుడు , గుణము ల మలినం లేదు అలాగే రూపంలేదు కాబట్టి గురు అన్నారు ఇంకా గుండ్రము అను పదము నుండి పుట్టిన పదమే గురువు అని చెప్పవ చ్చు ఆది మద్యాంత రహితుడైన పరమాత్మ భూమి పై భగవం తుడు (శ్రీకృష్ణ డు)గా జన్మిస్తే ఆయనను గురువు అని అంటాము పూర్వము గురువు గుండ్రాయి లాంటి వాడు సామెత గా అనెడి వారు, ఆది అంతము లేని గుండ్రాయి కి మొదలు చివర అనేవి ఉండవు, పరమాత్మ కూడా ఆది అంతం లేని వాడు కాబట్టి అలా పోల్చారు దేవుడే మనిషి గా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అని అనాలి ఆషాడ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండుట వలన గురు పౌర్ణమి గా నిర్ణయించి సాక్షాత్తు శ్రీ కృష్ణుడు ని జగద్గురువు గా భావించి గురు పూజ చెయ్యాలి..త్రైత సిద్ధాంత ఆదికర్త - శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు త్రైత సిద్ధాంత భగవద్గీత లో శ్రీ కృష్ణుని నిజ భావంను పొందు పరిచారు శ్రీ కృష్ణుడే జగద్గురువు అని నిరూపించారు కాబట్టి ప్రతి మనిషీ త్రైత సిద్ధాంత భగవద్గీత చదివి గురు పౌర్ణమి రోజున శ్రీ కృష్ణ పరమాత్మ నే గురువు గా పూజించాలి అని తెలియజేశార.ఈ కార్యక్రమం లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి బంగారు పాళ్యం2 కమిటీ అధ్యక్షులు ధనుంజయ గారు, మునిరత్నం, రాజేంద్ర, లోక నాథ్, హేమంత్, కిరణ్, ధర్మేష్, ఈస్వర్, ఆర్.సరళదేవి, చాముండేశ్వరి, కిట్టు, రోహిత, విమలమ్మ, నాగమ్మ, శాంతమ్మ, చిట్టెమ్మ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయండి

- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప దిశ నిర్దేశం
- పాత్రికేయుల ఇంటి పట్టాలు ఇప్పించి మాట నిలుపు కుంటా
- ప్రెస్క్లబ్ నూతన అధ్యక్షుడు జి.రమేష్ బాబు

మదనపల్లె క్రైమ్, జూలై 09, మనం న్యూస్: పాత్రికేయల సంక్షేమానికి ప్రెస్క్లబ్ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప సూచించారు. ఆదివారం ప్రెస్క్లబ్ నందు బండపల్లి అక్కులప్ప ఆధ్వర్యంలో ప్రెస్క్లబ్ కన్వీనర్, ఎన్నికల అధికారి వంశీధర్ ప్రెస్ క్లబ్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు ప్రెస్క్లబ్ నందు ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో సభత్వం కలిగిన పాత్రికేయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మదనపల్లె ప్రెస్క్లబ్ ఎన్నికలలో అధ్యక్షులుగా టీవీ 5 జి.రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా విశాలాంధ్ర బాల కృష్ణ యాదవ్, స్వతంత్ర టీవీ శ్రీధర్ బాబు, సంయుక్త కార్యదర్శిగా నమో టీవీ శేఖర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోటాపోటీగా జరిగిన కార్యదర్శి, ట్రెజరర్ ఎన్నికలో కార్యదర్శిగా ప్రజాశక్తి చంద్ర, ట్రెజరర్ గా ఎంసి టీవీ కిరణ్ కుమార్ గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి బండపల్లి అక్కులప్ప, కన్వీనర్ వంశీధర్ దిశానిర్దేశం చేశారు.పాత్రికేయుల ఇంటి పట్టాలు ఇప్పించి మాట నిలుపు కుంటా ప్రెస్క్లబ్ నూతన అధ్యక్షుడు జి.రమేష్ బాబు దీర్ఘకాలంగా మదనపల్లె పాత్రికేయులకు పెండింగ్లో వున్న పక్క గృహాలు, ప్రెస్క్లబ్ స్వంత భవనం, పాత్రికేయుల సంక్షేమానికి అవసరమైన నిధులు సమకూర్చడానికి కమిటీ సభ్యులు, పాత్రికేయులను కలుపుకుని శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని నూతన ప్రెస్క్లబ్ అధ్యక్షులు జి.రమేష్ బాబు తెలిపారు. నూతన కమిటీ ఎన్నికైన అనంతరం కమిటీ సభ్యులతో కలిసి రాబోయే రోజుల్లో పాత్రికేయు సంక్షేమానికి చేపట్టే చర్యలను వెల్లడించారు. పాత్రికేయుల అభినందనల అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు రమేష్ బాబు, ప్రదాన కార్యదర్శి చంద్ర, ట్రెజరర్ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీధర్ బాబు తాము చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వెల్లడించారు. ఎన్నో రోజులు ఎదురుచూస్తున్న ఇంటి పట్టాలు, ప్రెస్క్లబ్ స్వంత భవనం ఏర్పాటుకు మొదటి ఆరు నెలలలో పూర్తి చేస్తామని ప్రకటించారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆపద సమయంలో ఆదుకుంటామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా తమ గెలుపుకు సహకారం అందించిన పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.




# తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యం

- నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



రామసముద్రం, జూలై 09, మనం న్యూస్: సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా అసెంబ్లీలో అడుగుపెట్టి తిరుతాడని, దీనిని ఎవరూ ఆపలేరని తెలుగుదేశం జాతీయ పార్టీ ప్రధానకార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్పష్టం చేసారు. భవిష్యత్ కు గ్యారెంటీ పేరిట తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్ర రామసముద్రం మండలం లో ఆదివారం జరుగగా ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడు, లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని,వారికి తోడుగా మన మందరం పార్టీ గెలుపుకు పాటుపడాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మదనపల్లె నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపా టి రమేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు భవిష్యత్ కు గ్యారెంటీ పేరిట ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలో మహిళలకు,రైతులకు,నిరుద్యోగులకు మేలు జరుగుతుందని తెలిపారు. టిడిపి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను నిలువుదోపిడి చేసారని,అంతేకాకుండా ఇసుక,మట్టి,అటవీ సంపదను కొల్లగొట్టి, కోట్లు గడించి ఆడబ్బుతో ఓట్లు కొనుక్కొని తిరిగి అధికారం లోకి రావడానికి ఆరాటపడుతున్నారని వివ రించారు.రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లా డుతూ యువతకు ఉద్యోగ,ఉపాది కల్పిస్తామని వైసిపి ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు తుంగలో తొక్కి నిరు ద్యోగులకు కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. ఈకార్యక్రమంలో రా జంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంటా నరహరి,రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పర్వీన్ తాజ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు,పార్టీ పరిశీలకులు చలపతి నాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడు,మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, ప్రతీప్ రెడ్డి, ఆర్ జె వెంకటేష్, యశాస్వి రాజ్, యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, శివశంకర్, చిన్నుస్వామి, రాజేష్, ఒంటెల అల్తాఫ్, వేణుగోపాల్, జయప్ర కాష్, అశోక్, శ్రీకాంత్,జయ, అధికసంఖ్యలో నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

## వినాయకుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



కాణిపాకం, జూలై 09, మనం న్యూస్ : స్వయంభోసిద్ధి వినాయక స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బి ఎస్ పాటిల్ కుటుంబ సమేతంగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు కుటుంబ సమేతంగా మరియు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు సిపాయి సుబ్రహ్మణ్యం వీరు వీడి విడిగా దర్శనార్థం విచ్చేశారు వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ ఈవో వెంకటేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు అనంతరం ఆలయ అలంకార మండపంలో వేద పండితులు వచ్చే ఆశీర్వచనం చేసి వేద పండితులతో ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేష వస్త్రాలు అందజేశారు ఏఈఓ కృష్ణారెడ్డి ఏ ఈ ఓ మాధవరెడ్డి ఐరాల ఎమ్మార్వో సుశీల సూపర్డెంట్ రంగస్వామి టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు సురేష్ పాల్గొన్నారు

## గంగాధర్ మృతి టీడీపీకి తీరని లోటు



తొట్టంబేడు, జూలై 09, మనం న్యూస్ : మండలంలోని పూడి పంచాయితీ గ్రామ అరుంధతి వాడకు చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు ప్రసాద్ తండ్రి గంగాధరం గుండె నొప్పితో చెన్నైలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.అయన భౌతిక కాయానికి ఆదివారం బొజ్జల బృందమ్మ పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి తాము,తెలుగుదేశం పార్టీ నేతలు ఉంటామని గంగాధరం సతీమణి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, మాజీ సర్పంచ్ చెత్తమ నాయుడు, శంకర్ నాయుడు, వాణిజ్య విభాగం అధ్యక్షులు శేషమ నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు పెంచలయ్య, ప్రభాకర్, పురుషోత్తం నాయుడు, మునిరాజా నాయుడు, ప్రతాపరెడ్డి, చంద్రమ్మ తదితర నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు.

# తిరుపతి కలెక్టరేట్ వద్ద 36 గంటల అంగన్వాడీల నిరసనను జయప్రదం చేయండి

- సిఐటియు పిలుపు




తిరుపతి, జూలై 09, మనం న్యూస్: ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీ ఉద్యోగుల భద్రత, కనీస వేతనం, గ్రాట్యుటీ, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యల పరిష్కారంకై దేశవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం ఉందని నేతలు ప్రకటించారు. సోమవారం నాటి ఉదయం 10 గంటలకు నిరసన ప్రారంభమవుతుందని సీఐటీయు నేతలు కందారపు మురళి, ఎస్ వాణిశ్రీ, ఆర్. లక్ష్మి, నాగరాజమ్మలు ఆదివారం నాడు సీటు జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే నాలుగున్నర ఏళ్లు గా పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలైనా అంగన్వాడీల సమస్యలను దేశవ్యాప్తంగా పరిష్కారం చేయలేదని ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్ లను కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆ మేరకు అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు వేతనాలు పెంచలేదని గుర్తు చేశారు. 2018లో వర్కర్కు 1500 హెల్పర్ కు 750 మినీ వర్కర్ కు 1250 పెంచుతున్నామని ప్రకటన చేసి ఇంతవరకు అమలు చేయలేదని వారు తీవ్రంగా విమర్శించారు . 2017 నుండి టీఏ బిల్లులు ఇవ్వడం లేదని, 2022 ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీని అమలు పరచమని ఆదేశిస్తే నేటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023 - 24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లతో పాటు కోటి మంది స్కీం వర్కర్లకు ప్రయోజనం కలగలేదన్నారు ఐసీడీఎస్ కి నామమాత్రంగా 20,263 కోట్ల నుంచి 20,554 కోట్లకు బడ్జెట్ పెంచినప్పటికీ పెరుగుతున్న ధరలతో ఇది ఏమాత్రం సరిపోదన్నారు. గత 48 సంవత్సరాల నుంచి గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అవే సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమని విమర్శించారు. అంగన్వాడీలకు తెలంగాణలో కంటే అదనంగా వేతనాలు ఇస్తానన్న ముఖ్యమంత్రి గారి హామీ నీటి మీద వ్రాతగా మిగిలిందని, సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్వాడీలు నెట్టబడ్డారని నేతలు తీవ్రంగా విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్కే, ఎమ్మార్వో, ఎండిఓ మరియు, రాజకీయ నాయకులు విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులో హనుమాయమ్మ అనే అంగన్వాడి కార్యకర్తను రాజకీయ కక్షలతో నిర్దాక్షిణ్యంగా చంపారని, కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు కూడా లేదని వారు వాపోయారు. అంగన్వాడీలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యల పరిష్కారంకై జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే భారీ నిరసన కార్యక్రమాల్లో అంగన్వాడీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన



తిరుపతి, జూలై 09, మనం న్యూస్ : డయల్ యువర్ కమిషనర్ మరియు స్పందన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐ ఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జులై 10వ తేది సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంట ల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం అదేవిధంగా అర్జీలు, పిర్యాధులు ఇచ్చేవారికి కోసం ఉదయం 10:30 నుండి స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. పోన్ ద్వారా పిర్యా ధులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లా డవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవ ల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు.

## గంగాధరం భౌతికాయానికి ఘన నివాళి



తొట్టంబేడు, జూలై 09, మనం న్యూస్ : మండలంలోని పూడి గ్రామ పంచాయతీలో అరుంధతివాడకు చెందిన కుమ్మరిగుంట. గంగాధరం గత కొద్ది రోజులుగా అనారోగ్య కారణాలతో తిరుపతిలోని సిమ్స్లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న వైయ స్సార్సీపి పార్టీ గ్రామ ఇన్చార్జి చెరకు.నరసింహనాయుడు ఆయన భౌతిక్యానికి పూలమాలవేసి నివాళులర్పించి వాళ్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేడుకగా గుర్రప్ప స్వామి కొలుపు



శ్రీకాళహస్తి రూరల్, జూలై 9, మనం న్యూస్: మండలంలోని కమ్మకొత్తూరుగ్రామం లో ని శ్రీగుర్రప్ప స్వామి కొలుపుఆదివారం వేడుకగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పూజలు చేశారు. ఆడపడుచులకు వాయినాలు అందించారు.కొలుపు సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె శ్రీపవిత్ర రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్రజినీ, రమేష్, పుల్లయ్య, దేవి, సుబ్బారావు, రామూర్థి, రామారావు, సుబ్రహ్మణ్యం,అశోక్,కేశవులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారి దేవస్థానంలో జల ప్రసాదం కేంద్రాలు ప్రారంభం



కాణిపాకం, జూలై 09, మనం న్యూస్ : శ్రీ స్వామివారి దేవస్థానం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జల ప్రసాదం కేంద్రాలును ఈరోజు ప్రారంభించిన దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, మరియు ఈవో వెంకటేశు, దాత - శ్రీ పద్మావతి, ఉమా శంకర్ దీక్షిత్, కాలిఫోర్నియా, అమెరికా వాస్తవ్యులు, 3 జలప్రసాద కేంద్రాల యంత్రాలను ఏర్పాటు చేసి ఉన్నారు, ఈ యంత్రాలు సుమారు విలువ మొత్తం 7,50,000 రూపాయలు, ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎస్.వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపర్డెంట్ రంగ స్వామి, ఏ.ఇ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటన ఏర్పాట్లు అప్రమత్తంగా చేపట్టాలి





తిరుపతి, జూలై 09, మనం న్యూస్ : జాతీయ రహదారులు మరియు రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈ నెల జూలై 12,13 న జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల కొరకు అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా అప్రమత్తంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి సంబంధిత అధికారులతో అన్నారు.ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి డికె బాలాజీ, జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, విజయవాడ రాకేష్ కుమార్ సింఘ్, పిడి జాతీయ రహదారులు నెల్లూరు దేవేశ్ గోయల్, తిరుపతి పిడి వెంకటేశ్వర్లు లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు మరియు రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తాత్కాలిక పర్యటన షెడ్యూల్ మేరకు ఈ నెల జూలై12న జిల్లాకు రానున్నరని, 13న ఉదయం తిరుపతి పట్టణం లోని తారక రామ స్టేడియం నందు కృష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3 మరియు 4 (పోర్టు కనెక్టివిటీ) కు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించి శంఖుస్థాపన చేసి బహిరంగ సభలో పాల్గొన నున్నారని, అనంతరం రేణిగుంట- నాయుడుపేట జాతీయ రహదారి ఎన్హెచ్-71 మార్గంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిదిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్ద ఎత్తున సామూహిక మొక్కలు నాటే పాన్ ఇండియా కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుండి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో పగడ్బందీగా జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు తగినంత బందోబస్తు ఏర్పాటు, రైన్ ప్రూఫ్ షెడ్ ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్తు, జనరేటర్ ఏర్పాటు, శానిటేషన్ త్రాగునీటి ఏర్పాటు, ప్రోటోకాల్ విధులు, బ్యారికేడింగ్, ఫైర్ సర్వీసు తదితర ఏర్పాట్లను సక్రమంగా అధికారులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కోదండ రామిరెడ్డి, ఎస్ డి సి భాస్కర్ నాయుడు, తిరుపతి ఆర్ డి ఓ కనకనరసారెడ్డి, ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ కృష్ణారెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతా రామిరెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు వారపు సంతలో అన్నదానం



చంద్రగిరి, జూలై 09, మనం న్యూస్ : చంద్రగిరి వారపు సంతలో టిడిపి నాయకులు ఆదివారం అన్నదానం కార్యక్రమం చేశారు. తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా పార్లమెంటు ,చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆదేశాల మేరకు నాడు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ ద్వారా నేడు జగనన్న ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్ ఎత్తు వేయడం జరిగింది. అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని టిడిపి నాయకులు ప్రతి ఆదివారము చంద్రగిరి వారపు సంతలో అన్న దానం నిర్వహిస్తున్నారు. మండల అధ్యక్షులు పల్లి నేని సుబ్రహ్మణ్యం నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను పీడిస్తున్న జగనన్న పాలన లో నిత్యవసర వస్తువులు, కూరగాయలు కొని ఆకలి తీరేటట్టు లేదని వైకాపా ప్రభుత్వంపై తీవ్రంగా ఆయన ఖండించారు. అనంతరం చంద్రగిరి వారపు సంతకు వచ్చిన రైతులు మరియు కొనుగోలుకు వచ్చిన ప్రజలకు, అన్నా క్యాంటీన్ ద్వారా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌస్ బాష, సింగ్ సుధ, లంకెళ్ల లలిత, దొమ్మలపాటి సతీష్, ప్రవీణ్ రాయల్, రాకేష్ చౌదరి, అమ్ములు, రామారావు, నాయకులు, పాల్గొన్నారు.

## శ్రీ పార్వతాంభ సమేత శ్రీ సప్త ఋషీశ్వర తీర్థం సందర్శన



చంద్రగిరి, జూలై 09, మనం న్యూస్ : చంద్రగిరి మండల పరిధిలోని కొటాల పంచాయతీ. పాండురంగయ్య పల్లె సమీపంలో వెలసిన శ్రీ పార్వతాంభ సమేత శ్రీ సప్త ఋషీశ్వర తీర్థాన్ని ఆదివారం ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ ప్రతాప్ స్వామీజీ సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రకృతి అందాల నడుమ ఉన్న ఈ తీర్థం గొప్ప విశిష్టత గలదని, ఈ తీర్థాన్ని దర్శించిన వారికి కోరిన కోరికలు తప్పకుండా ఫలిస్తాయని, భక్తులు సందర్శించే గొప్ప మహిమలు గల ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన భక్తులకు సకల సంతోషాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయని ఆయన అన్నారు.

## తెలుగుదేశం పార్టీ జెండాను విడిచిన వారిపై చర్యలు తీసుకోండి

- రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసున్న తెలుగు తమ్ముళ్లు

శాంతిపురం, జూలై 09, మనం న్యూస్: శాంతిపురం మండలం కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ జెండాలను బ్యానర్లను కొంతమంది వైసిపి కార్యకర్తలు విరగ కొట్టడం చించడంపై శనివారం నాడు రాళ్ళబుదుగురు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు వారిపై కేసు నమోదు చేయలేదని తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి పాలనలో దౌర్జన్యాలను పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకపోతే మరల నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులను ఏకమై ధర్నాకు దిగుతామని తెలిపారు.శాంతిపురం బస్టాండు కూడలిలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి వైసిపి ప్రభుత్వంపై నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు ఇందులో భాగంగా రహదారిపై భారీ ఎత్తున వాహన రాకపోకలు స్తంభించాయి ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ నాయుడు, పీవీ నాగరాజు, జనార్దన్ రెడ్డి, ఉదయ్ కుమార్,ఆర్ ఎస్ మని, బసవరాజు, గోపాల్, రమేష్, చలపతి మరియు పలువురు ముఖ్య నేతలు కార్యకర్తలు ఉన్నారు.

# శ్రీకాళహస్తి మిట్ట కండ్రిగ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- కారు లారీని ఢీకొనడంతో ఆరుగురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు



శ్రీకాళహస్తి, జూలై 09, మనం న్యూస్ : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మిట్టకండ్రిగ వద్ద ఆదివారం గోర రోడ్డు ప్రమాదం చోటు చేసు కుంది. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా మిట్ట కండ్రిగ వద్ద కారు లారీని డికొనడం తో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాత పడగా, 17 ఏళ్ల భరత్ అనే యువకుడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. విజయవాడ అర్బన్ బాపనయ్య నగర్ రాణిగారి పేట చెందిన రమేష్ బాబు, నరసింహ మూర్తి కుటుంబ సభ్యులు ఇజు ఏటికా కారులో తిరుమల దర్శనార్థం వచ్చారు. తిరుమల దర్శనానంతరం మరో ఆలయానికి వెళ్లాలని వస్తూ ఉండగా మధ్యాహ్నం 1,30 గంటల సమయంలో శ్రీకాళహస్తి సమీపంలోని మిట్ట కండ్రిక వద్ద వేగంగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆరుగురు మృత్యువాత పడ్డారు. కారు డ్రైవర్ కారు కింద చిక్కుకు పోయి నుజ్జు నుజ్జు అయిపోయారు. ప్రమాదవస్థలిలో విజయవాడ అర్బన్ కు చెందిన 38 ఏళ్ల నర్సింహమూర్తి ఆయన భార్య వెంకటరమణమ్మ కుమార్తె 15 ఏళ్లు అక్షయ మరో కుటుంబానికి చెందిన రమేష్ బాబు, ఆయన భార్య రాజ్యలక్ష్మి, వారి బంధువు శ్రీలత దుర్మరణం చెందారు,. రమేష్ బాబు కుమారుడు 17 ఏళ్ల భరత్ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన భరతును 108 అంబులెన్స్ సిబ్బంది హుటా హుటినా శ్రీకాళహస్తి హాస్పిటల్ తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన భరత్ మాట్లాడుతూ తమ కుటుంబం అంతా తిరుమల దర్శనానికి వచ్చి తిరిగి మరో ఆలయానికి దర్శనానికి వెళుతుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. పోలీసు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తీవ్రంగా కాయపడిన భరతను తిరుపతి రుయాకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# మరలా టిడిపినే హత్యా ప్రయత్నం చేసిందని వైసిపి ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు

- తిరుపతి ప్రజల ప్రశాంతతకు భంగం కల్పిస్తున్న వైసిపి రౌడీ మూకల ఆగడాలను అరికట్టాలి
- జి.నరసింహ యాదవ్



తిరుపతి, జూలై 09, మనం న్యూస్: సాదారణ ఎన్నికలు జరిగే సమయం సమీపిస్తున్న తరుణంలో తిరుపతిలో ఇకమనంఎన్నికల్లో గెలవలేమనే భయంకొద్దీ వైసిపి రౌడీలు గూండాయిజానికి తెరదిం చారు, తిరుపతి రేణిగుంటరోడ్ ఆటోనగర్ నందు శనివారం జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనం,సతీష్ ,నాని ,అను ఇరువురిని వైసిపి యువజన నాయకుడు అజయ్ కుమార్ ఆఫీసుకురమ్మని వారిపై బీరుబాటిల్,కత్రుతో దాడిచేసిన వైసిపి రౌడీమూకల కిరాతకచర్యలను తెలుగుదేశంపార్టీ తీవ్రంగా ఖండిస్తూ ప్రజలను భయభ్రాంతులను చేసి ఆధ్యాత్మికన గరమైనతిరుపతిని అపవిత్రం చేస్తున్న దారుణాలను ప్రజలు గమనిస్తున్నారని తగిన గుణపాఠం త్వరలోనే జరుగుతుంది, తిరుపతి ప్రశాంతతను కాపాడవలసిన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, గాయాలుపాలైన టిడిపి కార్యకర్తలపైనే కేసులుబనాయిస్తూ మీడియాముందర మేము ఏపాపం ఎరుగమని నీతులువల్లిస్తుంటే చూసేవారు సిగ్గుతో తలదించుకొంటున్నారు, వైసిపి నాయకులుతెలుగుదేశం పార్టీ వారిపైనే హత్యాయత్నం చేసింది వాస్తవం కాని మీడియాతో మరియు సోషల్ మీడియాలో వైసిపి నాయకులు మాట్లాడుతూ తమపైనే టిడిపి నేతలు హత్యా ప్రయత్నం చేశారని అబద్ధ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు, వాళ్ళుకోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి దౌర్జన్యకాండ తిరుపతి ప్రజలకు తెలియదా?అదేధోరణిలో మీా ఎన్నికల్లో గెలవాలని ఎన్ని దౌర్జన్యాలు చేసినా చివరకు మీ పాపాలకు ఓటర్లే అంతంపలికారని గ్రహించి మళ్ళీఅ రాచకాలకు మొదలుపెట్టారా? మాయువనా యకుడు లోకేష్ ప్రజాసమ స్యలపైగళమెత్తి ప్రజలకు చేరువై వైసిపి అరాచకాలకు అక్ర మాలకు చెక్ పెడదామని భరోసాకల్పిస్తుం టే అతనిపై నిందారోపణలుచేయడం మీదు ష్టరాజకీయాలకు పరాకాష్ట శాంతి భద్రతల ను కాపాడాల్సిన పోలీసులు చోద్యం చూడ కండి, రౌడీలు గూండాల ఆటకట్టిం చాలి, గంజాయి వ్యాపారం ఎప్పు డూలేనంత వి ధంగావిచ్చలవిడిగా తిరుపతి పరిసరప్రాంతాల్లో ముఖ్యం గా యు వతను మత్తులోకి దించి తమ పబ్బంగడుపు కొంటున్న వారిపై చట్టప రమైన చర్యలు తీసుకోవాలి. వెంటనే తీవ్రంగా గాయప డిన టిడిపి కార్య కర్తలకు తగు న్యాయం చేయవలసిందిగా తెలుగు దేశం పార్టీ డిమాం డ్ చేస్తున్నది. ఇలాంటి కిరాతకచర్యలు తెలుదేశం కార్య కర్తలపై పున రావృతమైతే వైసిపి తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుం దని తెలు గుదేశంపార్టీ హెచ్చరిస్తున్నది తిరుపతిలో రౌడీయిజం గుండాయి జం చేసే పార్టీ ఏదో తిరుపతి స్థానిక ప్రజలందరికీ తెలుసు.

# ముండ్లపూడిలో ఘనంగా మహాభారత ఉత్సవాలు

- రూ.1,01,116/- విరాళం, పట్టువస్త్రాలు అందజేసిన పులివర్తి సుధారెడ్డి
- కళాకారుల ప్రతిభను ప్రశంసించిన పులివర్తి సుధారెడ్డి

తిరుపతి రూరల్, జూలై 09, మనం న్యూస్: ముండ్లపూడి గ్రామంలో మహాభారతం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి వారికి రూ 1,01,116/- విరాళంతో పాటు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతే కాకుండా కార్యకర్తలు ఎవరికి వారు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. గ్రామ పెద్దలు, ఆలయ అధికారులు, స్థానిక నేతలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఉత్సవాలలో భాగంగా దుర్యోధన వద ఘట్టాన్ని ఆమె తిలకించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు రక్తికట్టిస్తున్న కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాయజ్ఞం ధ్వజారోహణతో మొదలై దుర్యోధన వధతో ముగుస్తుందన్నారు. దీనిలో శ్రీకృష్ణలీలలు, పాండవజననం, బకాసురవధ, ద్రౌపది స్వయంవరం, సుభద్రా కళ్యాణం, రాజసూయయాగం, విరాటపర్వం, ఉత్తర గోగ్రహణం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణరాయబారం, కర్ణమోక్షం, దుర్యోధనవధ, ధర్మరాజు పట్టాభిషేకం వంటి ఘట్టాలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఘట్టం ఒక మహోత్సవమేనని అభివర్ణించారు. ద్రౌపదితో పాటు పాండవుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరుపుతారని తెలిపారు. బండికుంభం ఘట్టంలో భీమసేన పాత్రధారిని ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై ఊరేగించి బూరి నైవేద్యాలు సమర్పిస్తారని చెప్పారు. చివరిగా ఆలయం వద్ద భీమసేన, బకాసురుని యుద్ధ దృశ్యాలు ప్రదర్శిన ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ పండుగలో అర్జునుడి తపస్సుకు ఒక ప్రత్యేకత ఉందని వివరించారు. ఒక తాడి చెట్టుని ప్రతిష్ఠించి, అర్జునుడు ఆ చెట్టు ఎక్కేందుకు వీలుగా కొయ్య మెట్లు అమర్చి చెట్టును అందంగా అలంకరిస్తారని, అర్జునుడు పాత్రదారి పద్యాలు పాడుతూ చెట్టు ఎక్కి పూలు, నిమ్మకాయలు విసురుతారన్నారు. ఆ నిమ్మకాయలు తింటే సంతానం కలుగుతుందని, విసిరిన పుష్పాలు సౌభాగ్యాన్నిస్తాయనీ భక్తులు విశ్వసిస్తారని వెల్లడించారు.





## అస్రా కంటి ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్సీ



శ్రీకాళహస్తి, జూలై 09, మనం న్యూస్ : శ్రీకాళహస్తి లో నూతనంగా ఏర్పాటు చేసిన అస్రా కంటి ఆసుపత్రి ని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని ఆర్ ఆర్ థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అస్రా కంటి ఆసుపత్రిని అయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్రా కంటి ఆసుపత్రిని నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేశారని, శ్రీకాళహస్తి పట్టణంలో నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేయడం పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజల అదృష్టమని అన్నారు , కంటి ఆసుపత్రిలో శుక్లాల పరీక్ష, దృష్టి లోపం నివారణలో అయోపియా, కంటి లోపల విట్రియస్, శస్త్ర చికిత్సల ఆపరేషన్ లు, కంటి మార్పిడి,శుక్లాల మార్పిడి ఆపరేషన్లు ఈ అస్రా కంటి ఆసుపత్రి లో ప్రత్యేక నిపుణుల ద్వారా చేస్తారని తెలిపారు. అనంతరం ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కంట ఉదయ్,గంధం డాక్టర్ పి మునిరెడ్డి, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గంధం చంద్ర,,డాక్టర్ స్రవంతి, డాక్టర్ అరుణ్ సుభాష్ రెడ్డి, నాగి రెడ్డి, రఘు రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యంజియం ఆసుపత్రి సేవలను ప్రజలకు తెలపండి

- ఆర్ ఏం పి వైద్యులను కోరిన మయూర్



శ్రీకాళహస్తి, జూలై 09, మనం న్యూస్ : ఏం జి ఏం ఆసుపత్రి లో ఆదివారం ఆర్ ఏం పి వైద్యులందరికి ఆసుపత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి శ్రీకాళహస్తి,చుట్టు పక్కల గ్రామాల ఆర్ ఎంపీ వైద్యులందరు దాదాపు 100 మంది హాజరై సంతోషం గా గడిపారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోరి యం జి యం హాసుపత్రి ని నిర్మించామని యం జి యం హాస్పిటల్స్‌లో 24 గంటలు డాక్టర్ లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఫస్ట్ ఎయిడ్ తర్వాత వారికి కావలసిన ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలని వైద్యులం దరిని కోరారు. శ్రీకాళహస్తిలో ఇంత పెద్ద హాస్పిటల్ ని అందు బాటులోకి తీసుకొచ్చిన యం జి యం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ కి వైద్యులందరు అభినందనలు తెలియ చేశారు. ఈ కార్యక్రమం లో యం జి యం హాస్పిటల్స్ డాక్టర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నేత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం



రామకుప్పం, జూలై 09, మనం న్యూస్ : రామకుప్పం మండలం గోరివిమాకుల పల్లి పంచాయితీ సాకలకుప్పం గ్రామంలో ఆదివారం టి.డి.పి నేత కవిత అనారోగ్యంతో మృతి చెందినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఏ. ఆనందరెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షుడు మునస్వామి యువత అధ్యక్షుడు విశ్వనాత్ తెలిపారు సాకలకుప్పం గ్రామానికి చెందిన టి. డి. పి వీరాభిమాన కుటుంబసభ్యులైన బాలకృష్ణప్ప భార్య అనారోగ్యంతో ఉంటూ ఆదివారం మరణించడంతో మాజీ సి. ఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పార్టీ నిధులతో బాధిత కుటుంబ యాజమాని బాలకృష్ణకి 10 వేలు అర్థిక సహాయం అందించారు నిరంతరం 'తెలుగుదేశం జెండా' 'కార్యకర్తలకు అండగా' ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మండల టి. డి. పి పార్టీ అధ్యక్షుడు ఏ. ఆనందరెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు మునస్వామి యువత అధ్యక్షుడు విశ్వనాత్ గోరివిమాకులపల్లి గ్రామపంచాతీ మాజీ సర్పంచులు మహ్మద్ రఫీ,రామిరెడ్డి టి. డి. పి గ్రామపంచాయితీ అధ్యక్షుడు వెంకటరెడ్డి పంచాయితీ క్లస్టర్ ఇన్ చార్జీలుభూత్ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఆర్ఐ భరత్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

పూతలపట్టు, జూలై 09, మనం న్యూస్: బంగారుపాళ్యం మండలం తుంబ కుప్పం వైయస్సార్సీపి యువ నాయకుడు ఎన్ఆర్ఐ భరత్ కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు కేక్ కట్ చేసి భరత్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బంగారుపాళ్యం మండలం వైసీపీ యువ నాయకులు. పూతలపట్టు ఎంపీపీ కుమారి. పూతలపట్టు సుబ్బారెడ్డి సతీమణి గౌహతి. కుమారులు గురువేశ్వర్ రెడ్డి. తేజేశ్వర్ రెడ్డి తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి భరత్ కుమార్ రెడ్డి వైసిపి కి చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చైతన్య రెడ్డి మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు దయాశంకర్ రెడ్డి. మాజీ సింగల్ విండో అధ్యక్షులు ముత్తిరేవుల ఈశ్వర్ రెడ్డి. పేట అగ్రహారం ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి .జిల్లా వైసీపీ యూత్ నాయకుడు ప్రత్యూష. ప్రొఫెసర్ బాబు. నాయకులు వేంగనపల్లి చిట్టి రెడ్డి. ప్రభాకర్ రెడ్డి.రాజు. బాలాజీ. రామమూర్తి. పి ఎస్ ఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం..!

జమ్మూ, జూలై 9 : ప్రతికూల వాతావరణం కారణంగా మూడురోజులుగా నిలిచిపోయిన అమర్నాథ్ యాత్ర ఆదివారం పునః ప్రారంభమైంది. జమ్మూ-కశ్మీర్‌లోని పంజ్‌తరణి, శేష్‌నాగ్ క్యాంపుల నుంచి యాత్రికులు బయల్దేరారు. పంజ్‌తరణిలో దాదాపు 1500 మంది చిక్కుకుపోగా.. వీరిలో దాదాపు 200 మంది తెలుగువారు ఉన్నారు. అమర్నాథ్ ఆలయం వద్ద వాతావరణం సానుకూలంగా మారిన వెంటనే అధికారులు గేట్లను తెరిచి భక్తులు హిమలింగానికి పూజలు చేసేందుకు అనుమతించారు. ఇప్పటికే దర్శనం చేసుకొన్న భక్తులను బల్తాల్ బేస్ క్యాంపునకు చేరుకొనేందుకు అనుమతిస్తామని అధికారులు పీటీఐ వార్తసంస్థకు వెల్లడించారు. మరోవైపు అనంత నాగ్‌ల్లో సైన్యం తమ క్వాజిగుండ బేస్‌క్యాంప్‌లో 700 మంది యాత్రి కులకు ఆశ్రయం కల్పించింది. భారీ వర్షాల కారణంగా వారి యాత్ర నిలిచిపోయింది. మరోవైపు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి మూతపడింది. దీంతో జమ్మూ నుంచి కొత్తగా యాత్రికులను మాత్రం ముందుకు అనుమతించడం లేదు. ఈ జాతీయ రహదారిపై పలు చోట్ల కొండచరియలు విరిగి పడటంతో పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రామ్బన్ జిల్లాలో దాదాపు 40 అడుగుల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో 3,500 వాహనాలు చిక్కుకుపోయాయి. గురువారం రాత్రి నుంచి జమ్మూ-కశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు అమర్నాథ్ క్షేత్రం వద్ద భారీగా హిమపాతం పడుతోంది. దీంతో దాదాపు దాదాపు 50 వేల మంది యాత్రికులు తమతమ బేస్ క్యాంపుల్లోనే ఉండిపోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి రాష్ట్రంలో పరిస్థితి మెరుగు పడవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.

## ముదిరిన వివాదం..

చెన్నై, జూలై 9 : తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య వివాదం మరింత ముదిరింది. గవర్నర్ ఆర్ఎన్ రవి రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, దానివల్ల రాష్ట్రంలో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీఎం స్టాలిన్ ఆరో పించారు. ఈ మేరకు గవర్‌పై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఫిర్యాదు చేస్తూ.. సీఎం లేఖ రాసినట్లు ఆయన కార్యాలయం తెలిపిం ది. గతంలో కూడా గవర్నర్ తీరు గురించి సీఎం స్టాలిన్ రాసిన లేఖను రాష్ట్రపతికి డీఎంకే పార్టీ ఎంపీల బృందం అందించింది. ''గవర్నర్ ఆర్ఎన్ రవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 159 ప్రకారం ప్రమాణం చేసి, పదవి చేపట్టిన తర్వాత దాన్ని ఉల్లంఘించారు. రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఆయన చర్యల కారణంగా తమిళ నాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమా దం ఉంది'' అని సీఎం లేఖలో ఆరోపించారు. మంత్రి సెంథిల్ బాలా జీని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేసి, తిరిగి ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గడం ద్వారా గవర్నర్ తన రాజకీయ వైఖరిని ప్రదర్శించారని సీఎం స్టాలిన్ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు గత ఏఐఏడీఎంకే ప్రభుత్వ హయాం లో జరిగిన అవినీతికి సంబంధించి ఆ పార్టీ నాయకులపై విచారణ విషయంలో గవర్నర్ ఉదారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత కొంత కాలంగా గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ఆయన ఈ పదవికి అర్హుడు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తోందని సీఎం స్టాలిన్ లేఖలో పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని పదవిలో కొనసాగించడం ఏ మాత్రం సముచితం కాదని, ఆయన్ను పదవి నుంచి తొలగించాలా? వద్దా? అనే నిర్ణయాధికారం రాష్ట్రపతికే విడిచిపెడుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం అవినీతి ఆరోపణలతో ఈడీ అధికా రులు మంత్రి సెంథిల్ బాలాజీని అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆయనకు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఈ నేపథ్యంలో సెంథిల్ బాలాజీని మంత్రి మండలి నుంచి తొలగిస్తూ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. అయితే, గవర్నర్ నిర్ణయాన్ని భాజపాయేతర పార్టీలు ఖండించాయి. అంతకుముందు రాష్ట్ర శాసనసభలో తమిళనాడు, ద్రవిడ మోడల్ వంటి పదాలు, ద్రవిడ నాయకుల పేర్లను వదిలేసి గవర్నర్ ప్రసం గించడం వివాదాస్పదమైంది. ఆయన తీరుపై అధికార డీఎంకే కూట మి పార్టీలు భగ్గుమన్నాయి. ఆయన్ను రీకాల్ చేయాలని డిమాండ్ చేశాయి.

## వర్ష బీభత్సం

న్యూఢిల్లీ, జూలై 9 : వరుణుడి ప్రతాపంతో ఉత్తరాది ప్రాంతాలు విలవిలలాడుతున్నాయి. ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతు న్నారు. ఈ నేపథ్యంలో హస్తినలో సోమవారం స్కూళ్లన్నింటికీ సీఎం కేజ్రీవాల్ సెలవు ప్రకటించారు. గడిచిన 24గంటల వ్యవధిలో దిల్లీలో 153మి.మిల రికార్డుస్థాయి వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. 1982 తర్వాత ఒక్కరోజు ఇంత భారీగా వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారని వాతావరణ శాఖ వెల్లడించింది. 1982 జులై 25న 169.9మి.మిల వర్షపాతం నమోదు కాగా.. శని వారం నుంచి ఆదివారం ఉదయం 8.30గంల వరకు 153 మి.మీల మేర రికార్డుస్థాయి వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడిం చారు. గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుం డటం, వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని సోమవా రం అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్టు సీఎం కేజ్రీవాల్ ట్విటర్లో పేర్కొన్నారు. రోహిణి సెక్టార్ 23లో రహదారికి భారీ గుంత ఏర్పడింది. ఇటీవల జనక్పురి ప్రాంతంలో రహదారికి భారీ గుంత ఏర్పడిన ఘటనను ప్రజలు ఇంకా మరిచిపోకముందే ఈరోజు రోహిణి సెక్టార్ 23లో రోడ్డు కూలడంతో ప్రజలు షాక్ అయ్యారంటూ దిల్లీ భాజపా అధికార ప్రతినిధి ఖేంచంద్ శర్మ ఓ ఫొటోను ట్వీట్ చేశారు. ప్రస్తుతం దిల్లీ ప్రజలు వర్షం నీట మునిగిన రోడ్లపై నడవడానికి భయపడుతున్నారని పేర్కొన్నారు.

### కొట్టుకుపోయిన కార్లు.. వంతెనలు..!

మరోవైపు, ఢిల్లీ సహా ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తోంది. హస్తినలో శనివారం నుంచి ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉత్త రాది రాష్ట్రాల్లోని పలుచోట్ల రైలు పట్టాలపైకి నీరు చేరడం, కొండ చరియలు విరిగిపడటంతో ఉత్తరరైల్వే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. 17 రైళ్లను రద్దు చేయడంతో పాటు 12 రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు తెలిపింది. ఫిరోజ్పూర్ కంటోన్మెంట్ ఎక్స్‌ప్రెస్, అమృత్సర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చండీగఢ్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, చండీగఢ్ – అమృత్సర్ జంక్షన్ ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లు రద్దు కాగా.. ముంబయి సెంట్రల్ – అమృత్సర్ ఎక్స్‌ప్రెస్, అమృత్సర్ ఎక్స్‌ప్రెస్, దౌల్తాపూర్ చౌక్ ఎక్స్‌ప్రెస్ సహా మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్టు ఉత్తర రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి దీపక్కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. హిమాచల్‌లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. నదుల్లో నీటి ఉద్ధృతి పెరగడంతో అనేకచోట్ల రోడ్లు తెగిపోగా.. మరికొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడటంతో ట్రాఫి క్కు తీవ్ర అంతరాయం కలిగింది. కులు, సిమ్లా సహా పలుచోట్ల ఇళ్లపై కొండచరియలు విరిగిపడటంతో ఐదుగురు మృతి చెందారు.

# తిరుపతిలో జనంతో జనసేన కార్యక్రమం ప్రారంభం





తిరుపతి, జూలై 09, మనం న్యూస్: స్థానిక 33వ డివిజన్ స్యావెంజర్స్ కాలనీ నుంచి ఆదివారం జనంతో జనసేన కార్యక్రమం తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, బత్తిన మధుబాబు, బాబ్జి, రాజేష్ యాదవ్, ఆకేపాటి సుభాషిని, వనజమ్మ, ముక్కు సత్యవంతుడు, హేమ కుమార్ ఆ వార్డ్ అధ్యక్షుడు బాలాజీ, రా జేష్ ఆచారి, వినోద్, గుట్ట నాగరాజ్, దుర్గ, చందన, సాయిదేవ్, మ నోజ్, కిషోర్, చరణ్, సుమన్, బలరాం, రమేష్, హేమంత్, సాయి కుమార్, ఆది కేశవులు, కిరణ్, హిమవంత్, సుజీత్, సాయి, విశ్వ, మరి యు రాష్ట్ర, జిల్లా, పట్టణ ముఖ్య నాయకులు తో కలిసి ఘనంగా ప్రారం భించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మదనపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ రాందాస్ చౌదరి విచ్చేశారు..ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు అడుగడుగునా సమస్యల ను జనసేన పార్టీ దృష్టికి తీసుకురావటం జరిగింది, సంబంధిత సమస్య లను తక్షణమే పరిష్కరించుటకు మీకు అండగా ఉండి అధికార పార్టీపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించే వరకు పోరాడుతామని జనసేన నాయకులు స్థానికులకు హామీ ఇవ్వడం జరిగింది..ఈ సందర్భంగా జనసేన నాయ కులు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, సామా న్య ప్రజలు బ్రతికే పరిస్థితి లేదని, రాష్ట్రం మొత్తం అవినీతిమయంలో కురుకుపోయిందని, బీహార్ ను మించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వీటన్నిటిని చక్కదిద్దాలంటే వైసీపీని ఇంటికి పంపించాలని, కచ్చితంగా రేపు పవన్ కళ్యాణ్ సీఎం కావాలని ఈసారి జనసేన పార్టీకి అవకాశం కల్పించి, ఏ ఒక్క అవినీతి అక్రమాల మచ్చలేని నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగల మన పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వా రా, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ముఖ్యంగా లా అండ్ ఆర్డర్ ను చక్కదిద్ది ఆడపడుచులకు అండగా నిలవడమే జనసేన యొక్క ముఖ్య లక్ష్యం అని, పక్క రాష్ట్రాలకు తరలిపోయే వారికి ఉపాధిని కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## బొలెరో వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

- స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు



మదనపల్లి క్రైమ్, జులై 09, మనం న్యూస్ : బొలెరో వాహనం ఢీకొని మహిళ దుర్మరణం చెందిన విషాదకర సంఘటన పుంగనూరు మండ లంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి పుంగనూరు ఎస్సై మోహన్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌడేపల్లి మండలం, కావలివారిపల్లెకు చెందిన గోవిందు భార్య అమరా వతి(40) అదే పంచాయతీ, మాదంవారిపల్లికి చెందిన మునిగం గులప్ప(45)తో కలసి గుర్రంకొండ గురుకుల పాఠశాలలో చదువుతున్న అమరావతి కూతురిని పలకరించి రావడానికి మునిగంగులప్ప బైకులో బయలుదేరింది.మొదట మన పుంగనూరులో అమరావతి కుమార్తె కు కావాల్సిన స్నాక్స్ ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుని బైకులో ఇద్దరూ బయల్దేరి వెళుతుండగా మదనపల్లి పుంగనూరు రోడ్డులోని ఈడిగి పల్లి వద్ద బొలెరో వాహనం వీరు ఇద్దరూ ప్రయాణిస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమరావతి అక్కడికక్కడే దుర్మరణం చెందిందగా తీవ్రంగా గాయపడిన మునిగంగులప్పను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఘటన సమాచారం అందుకున్న పుంగనూరు పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి పంచ నామా అనంతరం మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చ డానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సిరి కళాక్షేత్రంలో కూచిపూడి నాట్యరంగ ప్రవేశం



కుప్పం, జూలై 09, మనం న్యూస్ : కుప్పం సిరి కళాక్షేత్రం కూచి పూడి నృత్య గురువులు శ్రీమతి సునీత మహేష్ గారి శిష్యులచే స్థానిక ఎస్వి కళ్యాణమండపంలో ఆదివారం నాడు సిరి కళాక్షేత్రం చే కూచిపూడి నాట్య రంగ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పం స్థానిక సి.ఐ. శ్రీధర్, లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ డా. ఎ.మహేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిరి కళాక్షేత్రంలో శిక్షణ తీసుకుంటున్న నాట్యమనులకు సర్టిఫికేట్ అందించారు. మొదటగా నటరాజ విగ్రహానికి పూజా కార్యక్రమాలను నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరు సంవత్సరాల శిక్షణ తీసుకొని కూచిపూడి నాట్యం లో ప్రావిణ్యం సాధించిన 4 కళాకారులకు సాంద్ర సింధు , కౌసల్య , భవ్యశ్రీ మరియు రక్షియశ్రీ కూచిపూడి నాట్య రంగప్రవేశం చేశారు . అదేవిదంగా శిక్షణ ప్రారంభిస్తున్న 15 మంది చిన్నారులు గురు పూజ చేసారు. కుప్పం ప్రాంతంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను మన సంస్కృతి సాంప్రదాయాలు చిన్న వయసు నుండి పిల్లలకు నేర్పిం చడం వారి అభ్యున్నతికి వారి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగప డుతుందని ఇటువంటి కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ చైర్పర్సన్ మహేష్ సతీమణి సునీతను కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ కోశాధికా రి పీజీ సెల్వం, డైరెక్టర్లు సెంథిల్ కుమార్,శివ, లెనిన్, విద్యార్థినిలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రామనామస్మరణతో సాగిన అయోధ్యకాండ అఖండ పారాయణం



తిరుమల,జూలై 09, మనం న్యూస్: తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఒకటో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా జరిగింది. శ్రీ హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తుల సమక్షంలో నిర్వ హించిన ఈ కార్యక్రమం ఆద్యంతం రామనామస్మరణతో సాగింది. ఇం దులో 1 నుండి 3 సర్గల వరకు గల 156 శ్లోకాలను పారాయణం చేశారు. వేద పండితులు అఖండ పారాయణం చేయగా భక్తులు వారిని అనుస రించి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు ఆచా ర్య రామానుజాచార్యులు, అనంత గోపాల కృష్ణ, పివిఎన్ఎన్.మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠ శాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్య యన సంస్థకు చెందిన వేద పారాయణ దారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. పారాయణం ప్రా రంభానికి ముందు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీ ఉదయ్ భాస్కర్ బృందం , చివర్లో హైదరాబాదుకు చెందిన శ్రీ నాగరాజు బృం దం భజన కీర్తనలను శ్రవణానందంగా ఆలపించారు. కార్యక్రమంలో ఎస్వీబిసి సిఈవో శ్రీ షణ్ముఖ కుమార్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సి పాల్ ఆచార్య కుప్పా శివసుబ్రమణ్య అవధాని, పండితులు, విశేష సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

# అగ్నిపథ్ పథకంపై కేంద్రం కీలక నిర్ణయం..




న్యూఢిల్లీ, జూలై 9 : కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా త్రివిధ దళాల్లో అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ పథకం కింద త్రివిధ దళాల్లో ఎంపికైన వాళ్లని అగ్నివీరులుగా పిలుస్తున్నారు. అయితే ఈ పథకంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అగ్నివీరులకు ఉపయోగపడేలా పలు కీలక మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అగ్రివీరుల కాల పరిమితిని అలాగే వారి వయస్సును పెంచే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలు స్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. ఇందులో ఎంపికైన యువ తలో కేవలం 25 శాతం మందికే నాలుగేళ్ల తర్వాత ఆర్మీలో రెగ్యులర్ క్యాడర్లో తీసుకోనున్నారు. అయితే దీనిని ఇప్పుడు ఈ 25 శాతం నుంచి 50 శాతానికి ఆర్మీలోని రెగ్యులర్ క్యాడర్లలో తీసుకొనేలా కేంద్రం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అలాగే, సాంకేతిక నేపథ్యం ఉన్న యువ కులను చేర్చుకోవడం, గరిష్ట వయోపరిమితిని 21 నుంచి 23 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసు కున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. జూన్ 2022లో ప్రారంభించిన అగ్ని పథ్ స్కీమ్ కింద 17.5–21 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులను అగ్నివీర్ల పోస్టుల కోసం పరిశీలిస్తున్నారు. మరోవైపు సాంకేతిక నేపథ్యం ఉన్న అభ్యర్థుల విషయంలో వయోపరిమితిని సడలించే అవకాశాలు కనిపి స్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 21 ఏళ్ల వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచ డంపై చర్చలు జరుగుతున్నాయి. గరిష్ట వయో పరిమితిని సవరించడం, దానిని 23 ఏళ్లకు పెంచడంపై చర్చ జరుగుతోంది. 2026 నాటికి దాదాపు 1.75 లక్షల మంది యువకులు అగ్నిపథ్ పథకం కింద చేరనున్నారనే అంచనాలు ఉన్నాయి. కాగా, ప్రతీ ఏడాది దాదాపు 60వేల మంది సైనికులు పదవీ విరమణ చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే మూడు సర్వీసుల్లో సైనికుల కొరత తీవ్రంగా ఉంది. కేవలం ఇండియన్ ఆర్మీలోనే 1.18 లక్షల మంది కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. అగ్నిపథ్ పథకం కింద త్వరలో అగ్నివీరులు త్వరలో వివిధ యూనిట్లలో చేరనున్నారు. మొదటి బ్యాచ్ శిక్షణ ముగియగా, రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. వచ్చే నెలలో మొదటి బ్యాచ్ ఇండియన్ ఆర్మీలో చేరనుంది. అయితే, శిక్షణ సమయంలోనే చాలా మంది యువకులు మధ్యలోనే వెళ్లిపోయారు. వివిధ కారణాలను చూపుతూ, సైన్యానికి వీడ్కోలు పలికిన యువకులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. శిక్షణ కోసం ఖర్చు చేసిన మొత్తాన్ని కూడా వారి నుండి రికవరీ చేస్తారు. ప్రస్తుతం ఆర్మీలో శిక్షణను మధ్య లోనే వదిలేయాలనే నిబంధన లేదని, ఇప్పుడు దాన్ని అరికట్టేందుకు కొత్త రూల్స్ తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. మొదటి బ్యాచ్లో 50 మందికి పైగా యువకులు శిక్షణను మధ్యలోనే వదిలేశారని, రెండో బ్యాచ్లో కూడా ఇదే పరిస్థితి ఉందని నివేదికలో ఓ అధికారి చెప్పారు.

## గ్రామోత్సవంలో పెద్ద శేష వాహనంపై ఎల్లమ్మ

- ఉభయ దాతలు డి.వెంకట్రాయలు నాయుడు



చంద్రగిరి, జూలై 09, మనం న్యూస్ : సత్య ప్రమాణాలు కొలు వైన చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూ లస్థాన ఎల్లమ్మ ఆది వారం సా యంత్రం 7 గంటలకు పెద్ద శేష వాహనంపై ఎల్లమ్మ ఊరేగారు. చం ద్రగిరి స్థానిక కొత్తపేట చెం దిన వెంకట్రాయలు నాయుడు కుటుంబ సభ్యులు శ్రీ మూల స్థాన ఎల్లమ్మ గ్రామోత్సవానికి ఉభయ దా తలుగా వ్యవహ రిం చారు. పాలకమండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి ఉభయ దాతలకు దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం తీర్థ ప్రసా దాలు అంద జేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ విగ్రహా మూర్తులను పడి కావలికి తీసుకొని వచ్చి, పెద్ద శేష వాహనంపై అధిష్టించి, వివిధ పరిమళ పుష్పాలు, బంగారు ఆభరణాలతో సింగారించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి, అమ్మవారు డప్పు, బ్యాండు, మంగళ వాయి ద్యాలు నడుమ శ్రీ మూలస్థాన ఎల్లమ్మ అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో పూరేగుతూ భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు, తదిత రులు పాల్గొన్నారు

## గరుడ వాహనంపై శ్రీసుందరరాజస్వామివారి కటాక్షం

- ముగిసిన అవతార మహోత్సవాలు



తిరుచానూరు, జూలై 09, మనం న్యూస్: తిరుచానూరు లోని శ్రీ సుందర రాజ స్వామి వారు ఆదివారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఆలయంలో మూడు రోజు ల పాటు జరిగిన శ్రీసుందరరాజ స్వామివారి అవతార మహో త్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వా మివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామి వారికి వైభవంగా అభిషేకం చేశారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో వేడుకగా అభిషేకం నిర్వ హించారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖమం డపం లో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహ నంపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, ఎవిఎస్వో శైలేంద్రబాబు, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాలిన్ బీ కుటుంబీకులకు హర్షిత్ రెడ్డి పరామర్శ



పాకాల, జూలై 9,మనం న్యూస్:పాకాల మండలం దామల చెరువుకు చెందిన మాజీ ఎంపీటీసీ నాగూర్ తల్లి మాలిన్ బీ ఇటీవల మృతి చెందారు. ఆదివారం జరిగిన కర్మక్రియలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు. మాలిన్ బీ చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు.

# వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువత

- యువత భవిష్యత్తుకు నాది భరోసా : టి.జి భరత్

కర్నూలు సిటీ, జూలై 09, మనం న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి యువకులు కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరంలోని మౌర్య ఇన్ లో ఉన్న టిజి భరత్ కార్యాలయంలో 12 వ వార్డు ఇంచార్జి చిన్నమ్మి ఆధ్వర్యంలో పండు యూత్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిజి భరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిజి భరత్ మాట్లాడుతూ యువ నాయకుడు పండు వర్గం వాస్తవాలు తెలుసుకొని మళ్లీ టిడిపిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సేవ కోసమే తమ కుటుంబం రాజకీయాల్లో ఉందన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలు రూపురేఖలు మారుస్తానని చెప్పారు. స్థానికంగా మంచి కంపెనీలు ఉంటే ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో బాగుపడుతుందని.. తనకు ఒక్క అవకాశం ఇస్తే కర్నూలు యువత భవిష్యత్తు మారుస్తానని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. యువకులంతా ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో



పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. కర్నూలు నుండి ఎంతో మంది యువతీ, యువకులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారని.. తనని గెలిపిస్తే కర్నూలుకు కంపెనీలు తీసుకొచ్చి ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. అందరినీ గెలిపించినట్టే తనను



కూడా ఒకసారి గెలిపిస్తే ఐదేళ్లు ఎలా పాలిస్తానో ప్రజలకే అర్థమవుతుందన్నారు. తమ టిజివి సంస్థల తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని.. అధికారంలో ఉంటే అంతకుమించి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం ఉంటుందని భరత్ అన్నారు. ప్రజలు మాయమాటలు నమ్మొద్దని వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, నాగార్జున, రాజశేఖర్, ఆంద్రూస్, సుధాకర్,బాలు, భాస్కర్, మనోహర్, జాకోబ్, తదితరులు పాల్గొన్నారు.

## బాల చిరంజీవిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ



కర్నూలు ప్రతినిధి, జులై 09, మనం న్యూస్ : దళితుడైన బాల చిరంజీవిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని, బాధితులతో కలిసి డోన్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డికి మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు బొందిమడుగుల టిఎం రమేష్ బాధి తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణం నందు చిగురుమానిపేట కాలనీలో నివాసం ఉంటున్న మాల కులానికి చెందిన బాల చిరంజీవి గుత్తి రోడ్డు నందు రేడియం స్టిక్కరింగ్ షాప్ పెట్టుకుని జీవనం పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు 23,6,2023 తేదీన రాత్రి 7:30 గంటల సమయంలో బాల చిరంజీవి రేడియం స్టిక్కరింగ్ షాప్ దగ్గర అనాథ అయిన కోమటి ప్రసాద్ ను అక్బర్ అనే వ్యక్తి మోటార్ బైక్ తో యాక్సిడెంట్ చేసి వెళ్లిపోయాడు యాక్సిడెంట్ గురైన వ్యక్తికి గాయాలు అవడంతో అక్కడే ఉన్న బాల చిరంజీవి మెకానిక్ యూనియన్ లీడర్ హుస్సేన్‌కు అన్న అక్బర్ దిక్కు దివానం లేని అనాథను యాక్సిడెంట్ చేసి వెళ్లిపోయాడు అతను హాస్పిటల్లో చూపించి బాగు చేయండి అని తెలపడంతో నువ్వు ఎవడు రా నాకు చెప్పడానికి అని హుస్సేన్ బాల చిరంజీవికి తెలపడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది దానిని మనసులో పెట్టుకున్న హుస్సేన్, 24,6,2023 తేదీన రాత్రి పది గంటల సమయంలో దళితుడైన బాల చిరంజీవి తన ఇంటి ముందు మంచం మీద పడుకొని ఉన్న సమయం చూసి హుస్సేన్ అనుచరులు పూల షేక్షా అల్లా బకాష్ సోహెల్ అందరూ కలిసి పడుకుని ఉన్న వ్యక్తిపై బండ రాళ్ళతో మోదీ రాడ్లు పైపులతో విచక్షణ రహితంగా దాడి చేసి పక్కటెముకలు విరగొట్టి మొహంపై బండరాళ్లతో మోదీ దవడ పగులగొట్టి విచక్షణ రహితంగా దాడి చేసి రక్త గాయాలపాలు చేశారు దాడికి గురై అపస్మారక స్థితిలో పడిపోయిన బాల చిరంజీవిని వారి బంధువులు డోన్ ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం అందించి అనంతరం టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు స్పందించిన పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 140/2023 సెక్షన్ 324 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాల చిరంజీవి పై దాడి చేసిన నిందితులను విచారణ అధికారి డోన్ డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి గారు తక్షణమే విచారణ చేపట్టి బండ రాళ్లు రాడ్లు పైపులతో విచక్షణ రహితంగా దాడి చేసి ఎముకలు విరగొట్టిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ పంపి బాధితులకి న్యాయం చేసి అండగా ఉండాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించడం మైనది, స్పందించిన డీఎస్పీ విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపుతామని తెలపడం మైనది, ఈ కార్య క్రమంలో బాల చిరంజీవి, రవి, రాధమ్మ రమాదేవి, ఓబుల మ్మ, నాగరాజు ప్రశాంత్, సంజీవ్, పాల్ పాల్గొన్నారు.

## బాలల సామర్థ్యాల పెంపుపై సదస్సు




కర్నూలు సిటీ జూలై 09, (మనం న్యూస్) : నగరం లోని బి. క్యాంప్ పరిధింగ గల ''నేతాజీ ను భాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయ ఆవరణలో ఈ రోజు ''బాలల సామర్థ్యాల పెంపుపై సదస్సు'ను ''పూర్ పీపుల్స్ డెవలప్ మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ'' ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు సంస్థ అధ్యక్షులు అధ్యక్షతన చెల్డ్ డెల్వేర్ కమిటీ సభ్యులు వెంకట రమణాచ్య రిసోర్స్ పర్సన్ కేర్ టేకర్ ఉమాదేవి మరియు ట్యూటర్ కేశవయ్య మరియు రూప పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. సదస్సులో సంస్థ సిబ్బంది, వసతి పొందుతున్న 75 మంది పిల్లలకు బాలల సామర్థ్యాల పెంపుపై సదస్సును నిర్వహిస్తూ అంతర్జాతీయంగా 1989 లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సభ్య దేశాలతో చేసుకున్న బాలల హక్కులపై ఒడంబడిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు మరియు వివిధ పిల్లల చట్టాలు, బాలల పరి రక్షణ మంత్రి ంగం, మిషన్ వాత్సల్య సీ., పియం కేర్స్ మొదలైన అంశాలపై వివరించడం జరిగింది.

## విశ్వ హిందూ పరిషత్ ''షష్టబ్ది'' మహోత్సవాలు




- విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర సహ కోషాధికారి గూడా సుబ్రహ్మణ్యం




కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్ : విశ్వ హిందూ పరిషత్ ''షష్టబ్ది'' (60 సం॥లు) మహోత్సవాలు ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విశ్వవిందు పరిషత్ రాష్ట్ర సహ కోశాధికారి, గూడ సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం రెవెన్యూ కాలనీ లోని శ్రీ భరతమాత మందిర ప్రాంగణంలో ఉన్న విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం, జి.పుల్లారెడి భవన్‌లో జరిగిన కర్నూలు జిల్లా సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహకోషోధికారి గూడా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 1964 సం. శ్రీ కష్ణ జన్మాష్టమి రోజున ముంబయ్‌లోని చిన్మయి మిషన్ ''సాందీపని'' ఆశ్రమంలో ఆవిర్భవించిన సామాజిక ధార్మిక సంస్థ విశ్వ హిందూ పరిషత్. ఈ సం.సెప్టెంబర్ 7 వ తేదీ నుండి 2024 శ్రీ కష్ణ జన్మాష్టమి వరకు'' విశ్వ హిందూ పరిషత్ షష్టబ్ది మెత్సవాలు'' జరుగు తాయని దానిలో భాగంగా కర్నూలు జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామానా విశ్వ హిందూ పరిషత్ కమిటీలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ జిల్లా విశ్వ హిందూ పరిషత్ లో పూరించ వలసిన మిగిలిన బాధ్యతలను వెంటనే పూర్తిచేస్తామని,జిల్లాలో ఉన్న ప్రఖండల కమిటీలను కూడా స్థాపనా దివస్ నాటికి పూర్తి చేస్తామని తెలియజేశారు. మొట్ట మొదటి సారిగా విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా లీగల్ సెల్ (విధిప్రకోష్ఠ) కన్వీనర్‌గా మనోహర్ రాజుని ఈ నెల 1,2, తేదీల్లో జరిగిన రాష్ట్ర సమావేశాల్లో నియమించారని, నేటి జిల్లా సమావేశంలో కండువా కప్పిఆయను జిల్లా సమితిలోకి ఆహ్వానించామని తెలియజేశారు. బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ మాట్లాడుతూ ఈ నెల 15,16 తేదీల్లో బజరంగ్ దళ్ విభాగ్ (కర్నూలు, నంద్యాల, ఆదోని) కార్యకర్తలకు కర్నూలు నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం భగవాన్ శ్రీ బాలసాయి ఆశ్రమంలో శిక్షణా శిబిరం ఉంటుందని దీనిలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలియజేశారు. అనంతరం 8 మంది కార్యకర్తలకు కర్నూలు నగరంలోని వివిధ ప్రఖండలలో బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రసార్ విభాగ్ కన్వీనర్ కాళంగిరి విజయుడు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్ర కాష్, సహకార్యదర్శులు గోవిందరాజులు, శివప్రసాద్, సేవా కన్వీనర్ తుంగా రమేష్ మాతశక్తి కన్వీనర్ రాధిక, దుర్గావాహిని కన్వీనర్ ఈపూరి లక్ష్మి, నగర అధ్యక్షులు టీ.సీ.మద్దిలేటి, కార్యదర్శి ఈపూరి నాగరాజు, నగరంలోని 6 ప్రఖండల అధ్యక్ష, కార్యదర్శి, బజరంగ్ దళ్ కార్యకర్తలు, కోడుమూరు అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి నటరాజ్ పాల్గొన్నారు.

## పసుపల గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలి



- వ్యకాస

కర్నూలు, జులై 09, మనం న్యూస్ : పసుపల గ్రామంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకట రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం పసుపల గ్రామంలో వ్యవసాయ కూలీలతో జనరల్ బాడీ సమావేశం జరిపి,ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కూలీలతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకట రాముడు మండల నాయకులు ఉషనయ్య మాట్లాడుతూ పసుపల గ్రామంలో, 10 సంవత్సరాల నుండి ఉపాధి పనులు పెట్టడం లేదని ఉపాధి పనులు లేక వ్యవసాయ కూలీలు కర్నూలు నగరానికి వెళ్లి అక్కడ పనులు దొరుకుతే చేసినట్టు లేక పోతే ఊరికే వచ్చే పరిస్థితి ఉంటుందని వారు తెల్పారు.రాజకీయ జోక్యంతో పనులు నిల్పివేయాడం వలన ఏదో, శాస్త్రం చెప్పినట్టు ఆవులు ఆవులు కొట్లాడితే దూడల కాళ్లు విరిగినట్టు, రాజకీయ జోక్యం వలన వ్యవసాయ కూలీలుఅన్యాయం అవుతున్నారని వారు విమర్శించారు.అధికారులన్న, జోక్యం చేసుకుని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సింది పోయి అధికారులు కూడా ఇంతే సాల్లే మాకు కూడా పని, తగ్గిందిలే అని వారు వున్నాట్లు కన్పిస్తుందిని వారు విమర్శించారు.ఉపాధి పనులకు వెళ్ళడానికి కూలీలు సిద్ధంగా ఉన్నారని కావున అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఉపాధి పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.లేని యడల కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుందరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి రావు, నాగేశ్వరమ్మ, సరస్వతమ్మ, నాగరాజు, అయ్యన్న, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పని భారం తగ్గించాలి



కర్నూలు సిటీ జూలై 09, (మనం న్యూస్) : గ్రామ/వార్డు సచివాలయాలలో పని చేసే ఏఎన్ఎం లను గ్రేట్ పక్క 3 నుండి గ్రేడ్ 2 కు మార్చాలని గ్రామ వార్డు సచివాలయాల ఎం ప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ ఆర్గ నైజర్ జి.సంధ్యారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్లో ఏఎన్ఎంల జిల్లా కమిటీ సమావేశం మహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శంలో జి. సంధ్యారాణి మాట్లాడుతూ డిపార్ట్మెంటల్ టెస్ట్ పాస్ అయినప్పటికీ గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 కు మార్చాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. సచివాలయంలో పనిచేసే రెవెన్యూ డిపార్ట్మెంట్ కు బయోమెట్రిక్ ఎక్కడైనా వేయవచ్చు అని పద్ధతిని ఏఎన్ఎంల కూడా వర్తింపచేయాలని కోరారు. సెలవు కావాలంటే ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్,పంచాయతీ కార్యదర్శి అనుమతులను తీసుకున్న తర్వాతే సెలవు మం జూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎం లకు ఉన్నన్ని యాప్లు ఏ ఉద్యోగికి లేవని చెప్పారు. దీనితో పని ఒత్తిడి ఎక్కువైందని చెప్పారు. సచివాలయంలో పనిచేసే ఉ ద్యోగులు ఉదయం 10 గంట ల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. కానీ ఏఎన్ఎం లు 24 గంటలు పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫోటోలు ప్రూఫ్ లతో సహా అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అంగన్వాడి, ఆశ, ఎం.ఎల్.హెచ్.పి, మె డికల్ ఆఫీసర్ల పనులన్నీ ఏఎన్ఎంలు చేయాలని చెప్పారు. అలా చేయని పక్షంలో షోకాజ్ నోటీసులు మెమోలు ఇస్తా రు. వాటిని ఎస్ఆర్‌లో ఎంట ర్ చేస్తామని బెదిరిస్తూ తమతో పని చేస్తున్నారని చెప్పారు.ప్రొ హిబిషన్ డిక్లేర్ కానీ వారు ఇం కా జిల్లాల 25 మంది దాకా ఉన్నారు. మాలో ఐక్యత లేకపోవడంవల్లనే మాపై ఇలాంటి వేధింపులు చేస్తున్నారని చెప్పారు. సెలవుల్లో ఉన్నప్పటికీ మా పని ప్రతిరోజు పని చేస్తూనే ఉం డాలని తెలియజేశారు. ఉన్నతాధికారులు దయతలచి పని భారాన్ని తగ్గిం చాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధా కష్ణ, యూనియన్ జిల్లాకమిటీ సభ్యులు హెచ్. గౌరీ, బి. దేవి, ఎన్. మేరమ్మ ఆర్. ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన వైసీపీ



కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్ : స్థానిక సమస్యల ను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్ తీవ్రంగా విమర్శించారు కర్నూలు నగరంలోని రెండో వార్డు లో మూడో వార్డులో సమస్యలతో ప్రజానీకం సతమతమవుతా ఉన్నారని నగర పలక మండలి గాని కార్పొరేషన్ కమిషనర్ గాని అధికారులు కానీ పట్టించుకోవడంలేదని ఎక్కడి సమస్యలు ఆక్కడే ఉన్నాయని వారు ధ్వజమెత్తారు నగరంలో ఉండే వీధులలో ఎక్కడ చూచిన చెత్తాచెదారంతో కంపు కొడుతున్నాయని వారు తెలియజేశారు తగిన పారిశుద్ధ్య సిబ్బంది కొరత వల్ల అనేక వీధులలో మురుగు కాలువలు నిండి పొరులుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు నగర కార్పొరేటర్లు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దష్టి కేంద్రీక రించాలని వారు హితవు పలికారు నగరంలో అభివద్ధి పేరు మీద అనేక చోట్ల నిధులను దుర్వోగం చేసి ప్రజల పైన మోయలేని భారాలు వేస్తా ఉన్నారని నగర పాలక మండలి పైన దుమ్మెత్తి పోశారు ఐఏఎస్ ఆఫీసర్ కమిషనర్ ఉన్నప్పటికీ ప్రజల డబ్బులు వధా చేయడం సరైనది కాదని దుయ్యబట్టారు నగరపాలక సంస్థ కర్నూ లులో జరుగుతున్న అభి వద్ధిని చూసి ప్రజలు నువ్వేరా పోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు చిన్నప్పుడు పిట్టలదొర అని ఉండే వాడని అతడు కొట్టాలను పీకి మిద్దలను కడతాం మిద్దలను పీకి కోట్టాలు వేస్తాం అనే టైపులో కర్నూలు నగరపాలక సంస్థ యొక్క అభివద్ధి ఉందని మండిపడ్డారు నగరంలో ప్రధాన కూడలిలాలో ఉన్న బస్సు స్టాప్ లను బాగా ఉన్న దానిని పగలగొట్టి పడగొట్టి మళ్లీ అవే తిరిగి నిర్మిస్తా ఉన్నారు డివైడర్లను తొలగించి కొత్త డివైడర్లు వేస్తున్నారు పాత మన్ను తీసేసి కొత్త మన్ను వేస్తున్నారు ఉన్న మొక్కలను పీకేసి మళ్లీ మొక్కలు వేస్తా ఉన్నారు పిచ్చి తుగ్లక్ పాల నా ల ఉంది అని వారు నిప్పులు చెరిగారు ఇంకొక వైపు ప్రజల పైన చెత్త పన్ను కరెంటు చార్జీల మోత ఆర్టీసీ బస్సు చార్జీలమవుతా కూరగాయ ధరల ఘాతం నిత్యావసర వస్తువుల ధరలు రోకలి పోటు జగన్ సర్కార్ వ్యవహారం ఉందని వారు తీవ్రంగా విమర్శించారు దక్షిణమే వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ప్రజలందరిని సమీకరించి వైసిపి సర్కార్ కు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు జగన్ సర్కార్కు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం వార్డు సహాయ కార్యదర్శి నూర్ భాషా రాజు పెద్ద మద్దిలేటి అబ్దుల్లా చిన్న మద్దిలేటి అబ్దుల్ రెహమాన్‌పాల్గొన్నారు.

## సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలు నియంత్రించండి

- జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు
- జాతీయ రహదారులపై రాంగ్ రూట్‌లలో వెళ్ళవద్దు
- వాహనదారులు మీ భద్రతకు పోలీసుల సూచనలు పాటిస్తూ గమ్యాలకు క్షేమంగా చేరాలి
- ఇతరులకు, మీకు ప్రాణనష్టం జరగకుండా మీ ప్రాణాలను రక్షించుకోవాలి





కర్నూలు, జూలై 09, (మనం న్యూస్) : రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన చేసేలా చర్యలు చేపట్టాలని, జరిమానాల కంటే అవగాహన కల్పించడం ముఖ్యమని జిల్లా పోలీసు యంత్రాంగం సమిష్టిగా కషి చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ తెలిపారు. గత 6 నెలలుగా (జనవరి నెల నుండి జూన్ నెల వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను ఆదివారం విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 3,506 కేసులు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 37,483 కేసులు, మైనర్ల పై 303 కేసులు. ఒన్ వేలో రాంగ్ రూట్ వెళ్ళిన వారిపై 1,393 కేసులు. మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారి పై 1,716 కేసులు. జంపింగ్ సిగ్నల్స్ చేసిన వారి పై 58 కేసులు. ఏలాంటి రికార్డులు పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారిపై 64,926 కేసులు. సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు , జీపులు , తదితర వాహన చోదకులపై 4,127 కేసులు. అతి వేగంతో వెళ్లిన వాహనాలపై 12,214 కేసులు. ఓవర్ లోడ్‌తో వెళ్ళిన వాహనాల పై మోటారు వాహనాల చట్టం కింద 1,819 కేసులు. త్రిబుల్ రైడింగ్ పై 6,612 కేసులు. రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై 4,230 కేసులు. రాంగ్ పార్కింగ్ చేసిన త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల పై 3,602 కేసులు. నంబర్ ప్లేట్ లేని వాహనాల పై 2,536 కేసులు. డ్రంకెన్ డ్రైవ్ పై 819 కేసులు మొత్తం 5 లక్షల 59 వేల ఈ - చలనాలు పెండింగ్ లో ఉన్నాయని, ఇందులో( జనవరి నుండి జూన్ వరకు) 1, 55, 947 ఈ చలనాలను (రూ. 3 కోట్ల 6 లక్షల 4 వేల 445 రూపాయలను) రికవరీ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100 కు సమాచారం చేరవేయాలని జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ విజ్ఞప్తి చేశారు.

## బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు



కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్ : బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ కర్నూలు నగరం లోని బీడీ వర్కర్స్ కాలనీలు గంగావతి నగర్ వీకర్ సెక్షన్ కాలనీ లలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఓబులు పర్యటించి బీడీ కార్మికులతో కలిసి వారి సమస్యల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు వీరి వెంట సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా కె సుధాకరప్ప ఉన్నారు అనంతరం యస్ శ్యామలమ్మ యస్ షబానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబుల్ గారు మాట్లాడుతూ బీడీ కార్మికులు చాలీచాలని వేతనాలతో చిన్నచిన్న గహాలలో నివాసం వుండి కుటుంబాలతో కలిసి జీవనం చేయుచున్నారని వీరి పట్ల కార్మిక శాఖ అధికారులు ఏమాత్రం కూడా పట్టించుకోవడంలేదని తెలిపారు 1000 బీడీలకు అర్ధ కేజీ ఆకు వేసి దీంట్లోనే చేయాలని కండిషన్లతో పని చేయించుకుంటూ అతి తక్కువ కూలీలు ఇచ్చి సరైన కూలీలు ఇవ్వ కుండా బీడీ కారానా యజమానులు దోపిడీ చేస్తున్నారని తెలిపారు అలాగే కారానా యజమానులు కాకుండా మధ్యదళారుల ద్వారా ఆకు సప్లయ్ చేస్తున్నారని తెలిపారు తెలంగాణలో బీడీ కార్మికులకు నెలకు 1500 పెన్షన్ ఇస్తున్నారని అలాగే తమిళనాడు కేరళ రాష్ట్రాలలో బీడీ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు బీడీ కార్మికులకు అనేక జబ్బులు వస్తున్నాయని క్షయ కీళ్ళు నడుముల నొప్పులు చాలామంది బాధపడుతూ తెలిపారు వీరికి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించి బీడీ కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు సిఐటియు నాయకులు సిహెచ్ సాయిబాబా కె సుధాకరప్ప ఎస్ శ్యామలమ్మ ఎస్ షబానా బీడీ కార్మికులు హాజరయ్యారు.

## వివాహ వేడుకకు హాజరైన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



హోళగుంద, జూలై 09, మనం న్యూస్ : హోళగుంద మండల కేంద్రంలో బాగోడి వెంకటేష్ తనయుడు సిద్దార్థ్ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు , యువ నేత గుమ్మనూరు ఈశ్వర్ హాజర య్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను శుభా కాంక్షలు తెలిపి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజా పంపన్న గౌడ్, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు బాగోడి పాలాక్షి, రాము, తోక వెంకటేష్, ఎంపిపి తనయుడు ఈసా, మండల వైయస్సార్సీపి మండల నాయకులు మరియు కార్యకర్తలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



కోసిగి, జూలై 09, (మనం న్యూస్) : మండల కేంద్రమైన కోసిగి లో శ్రీ సిద్దరుడా మఠం నందు అఖిల భారత విద్యార్థి పరిషత్ 75 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఆదివారం కోసిగి మండల ప్రధాన కార్యదర్శి మర్రిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఏబీవీపీ వారి ఆధ్వర్యంలో భరతమాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కోసిగి ప్రాథమిక కేంద్రం నందు బాలింతలకు, పేషెంట్లకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి మర్రిస్వామి మాట్లాడుతూ వివేకానంద యువతకు ఆదర్శం అని అందరూ ఆయన బాటలో నడవాలి అని అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం కోసం ఏబీవీపీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదెప్ప, వినోద్ కుమార్, తిరుమల, వీరేంద్ర, ఏబీవీపీ టౌన్ ప్రెసిడెంట్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కిందపడి జ్యోతిబాపూలే పాఠశాల చైర్మన్ మృతి



వెల్దుర్తి, జూలై 09, (మనం న్యూస్) : వెల్దుర్తి లోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాల చైర్మన్ అనకల గిడ్డయ్య (40) ప్రమాదవశాత్తు కిందపడి ఆదివారం మృతి చెందాడు. ఇంట్లో నుంచి మెట్లు దిగుతుండగా కాలుజారి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇతని మతికి జడ్పిటిసి సుంకన్న, మండల వైకాపా కన్వీనర్ రవి రెడ్డితో పాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# టీడీపీ ఆపరేషన్ స్టార్ట్

- అసమ్మది నియోజక వర్గాలపై ప్రత్యేక దృష్టి




కర్నూల్, జూలై 09, మనం బ్యూరో : తెలుగు దేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ తగాదాలతో కొట్టుమిట్టాడుతున్న అసెంబ్లీ నియోజక వర్గాలపై దష్టి సారించింది. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల ఓటమికి గల కారణాలను అన్వేషంలో భాగంగా అధిష్టానం ఆయా నియోజక వర్గాలపై కసరత్తు ప్రారంభించింది. విజయవాడలోని పార్టీ కార్యాల యాన్ని ఆపరేషన్ థియేటర్‌గా ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలో గ్రూపు తగాదాలతో కొట్టుమిట్టాడుతున్న నియోజకవర్గ నాయకులను ఆహ్వానించి అక్కడి సమస్యలపై డయాగ్నోసిస్ చేసి, అవసరమైన ఆపరేషన్ నిర్వహించేందుకు కసరత్తు ప్రారం భించింది. ఇప్పటికే రాష్ట్రంలోని కడప తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. త్వరలో కర్నూలు జిల్లాలో కూడా ఆపరేషన్ ప్రారంభించనుంది. ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలలో సగం అసెంబ్లీ నియోజకవర్గాలు గ్రూపు తగాదాలతో కొట్టుమిట్టాడుతున్నాయి ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఆళ్లగడ్డ, డోన్, కోడుమూరు అసెంబ్లీ నియోజక వర్గాలలో టిడిపి నేతల మధ్య వివాదాలు తారస్థాయికి చేరుకున్నాయి. మంత్రాలయం నియోజవర్గంలో బీసీలకు టికెట్ ఇవ్వాలని వాల్మీకి సామాజిక వర్గ నేతలు ఉలిగయ్య ,రామిరెడ్డి, ముత్తిరెడ్డి కోరుతున్నారు. మంత్రాలయ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు అయిన తర్వాత మొదటిసారిగా 2009లో జరిగిన ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థి వై బాలనాగిరెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన టిడిపి నుండి వైసీపీలో చేరిన తర్వాత 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి వరుసగా విజయం సాధించారు. దీంతో ఈ నియోజకవర్గంలో టిడిపి అధిష్టానం ప్రత్యేక దష్టి సారించి, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవసరమైన చర్యలను, ప్రణాళికలను రూపొందిస్తోంది. టిడిపి గ్రూపు తగాదాల వల్ల అక్కడ వైసిపి అభ్యర్థి విజయం సాధిస్తున్నారని టిడిపి భావిస్తోంది. దీంతో ఈ నియోజకవర్గ నాయకులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ఆలూరు అసెంబ్లీ నియోజవర్గంలో కూడా టిడిపి గ్రూప్ తగాదాల కారణంగా వరుసగా ఇక్కడ టిడిపి అభ్యర్థి ఓటమిపాలవు తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతి సారి ఆలూరు అసెంబ్లీలో అభ్యర్థిని మార్చడం ప్రధాన కారణంగా నిలుస్తోంది.పార్టీ టికెట్టు ఆశించిన వారికి టికెట్ లభించకపోవడంతో ఈ నియోజకవర్గంలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. దీంతో ఈ నియోజకవర్గంపై కూడా ఆపరేషన్ చేసేందుకు అధిష్టాన వర్గం సిద్ధమైంది. ఇటీవల ఆలూరులో నిర్వహించిన టిడిపి బస్సు యాత్రకు టిడిపి నాయకులు వీరభద్ర గౌడ్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైకుంఠ శ్రీరాములు తనయుడు మల్లికార్జున చౌదరి వర్గం హాజరు కాలేదు. ఈ నియోజకవర్గ నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తున్నారు అయితే ఆమెకు పార్టీ టికెట్ ఇస్తే తాము సహకరించ లేమని వీరభద్ర గౌడ్ మల్లికార్జున చౌదరి బాహాటంగా పేర్కొంటున్నారు. వీరిద్దరితో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అమరావతిలో సమావేశం నిర్వహించి ఆపరేషన్ చేయనున్నారు. ఆదోని అసెంబ్లీ ,కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం లోను ఇదే పరిస్థితి . ఆదోని అసెంబ్లీ నుంచి గుడిసె కష్ణమ్మ, భాస్కర్ రెడ్డి తో పాటు ముస్లిం మైనార్టీ నాయకులు పోటీ చేసేందుకు పార్టీ టికెట్టు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు మళ్లీ పోటీ చేసేందుకు ఆయన సిద్ధం అవుతున్నారు. ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గం కోడుమూరు అసెంబ్లీ నుంచి టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, టిడిపి కోడుమూరు మాజీ ఇంచార్జి విష్ణువర్ధన్ రెడ్డి తమ వర్గాలకు పార్టీ టికెట్ ఇప్పించుకునేందుకు గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని మాజీ మంత్రి అఖిలప్రియ, టిడిపి నాయకులు ఏవి సుబ్బారెడ్డి మధ్య గత కొంతకాలంగా గ్రూపు తగాదాలు కొనసాగు తున్నాయి. ఇటీవల నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఈ విభేదాలు మరింత తారాస్థాయి చేరుకున్నాయి.ఒకరిపై ఒకరు కొట్టుకొని, కేసులు పెట్టి జైలుకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి .ఈ విషయాన్ని కూడా పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ తీసుకుంది. డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ టికెట్ బీసీలకు ఇవ్వాలని, కే ఈ వర్గం పట్టుబడుతోంది.అయితే ఈ నియోజకవర్గ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గతంలో ప్రక టించారు. దీంతో కే ఈ వర్గం నియోజవర్గంలో జరిగే పార్టీ కార్య క్రమాలకు దూరంగా ఉంటుంది. ఈ నెల నాలుగో తేదీ కర్నూలు జిల్లాలో అడుగుపెట్టిన టిడిపి బస్సు యాత్ర పత్తికొండ, ఆలూరు ఆదోని ,మంత్రాలయం, ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గాలలో పూర్తి చేసుకుని ఆదివారం కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోకి అడుగు పెట్టింది. సోమవారం కర్నూల్ అసెంబ్లీ పరిధిలో ఈ యాత్ర కొనసాగనుంది.అనంతరం నంద్యాల జిల్లాలో ఈ యాత్ర కొనసాగ నుంది. జిల్లా పార్టీ అధ్యక్షులు బిటి నాయుడు, మల్లెల రాజశేఖర్ సూచన మేరకు ఆపరేషన్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అప్పటికి గ్రూపు నాయకులు అధిష్టాన విధానాలను నిర్లక్ష్యం చేస్తే ,వారిపై వేటు వేసేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకునే ప్రణాళికలో భాగంగానే జిల్లాల వారీగా టిడిపి అధిష్టానం కసరత్తు చేపడుతోంది.కాగా అధిష్టాన వర్గం సూచనలు నచ్చని కొంతమంది టిడిపి నాయకులు వైసీపీలో చేరేందుకు కూడా సిద్ధమైనట్లు సమాచారం.అయితే ఈ లోటును భర్తీ చేసేందుకు టిడిపి కూడా వ్యూహం రూపొందించనుంది.

# గడప గడపకు సంక్షేమ పథకాలు





- పార్టీలకు అతీతంగా లబ్దిదారుల ఇళ్లవద్దకే సంక్షేమ పథకాలు

కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్ : 12వ వార్డ్ 28వ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్, ప్రతి గడపకు వెళ్లి, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ఆప్యాయంగా ప్రజలను పలుకరిస్తూ సమస్యల పరిష్కార దిశగా సాగిన కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం. కర్నూలు నగరంలోని 12వ వార్డ్ 28వ సచివాలయం, ఖడక్ పూర మైదానం విధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన, సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్ అన్న అని ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్‌కి స్థానిక నాయకులు పూలదండలు బొకేలతో ఘనంగా స్వాగతం పలికిన వార్డు ప్రజలు, సాయంత్రం కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని 12వ వార్డ్ 28వ సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మనకు మన ప్రభుత్వానికి జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. జగనన్న పరిపాలనలోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయి అని అన్నారు. వీధిలో ఉన్న డ్రైనేజీ, మురికి కాలువల సమస్యను ఎమ్మెల్యే, దష్టికి తీసుకొచ్చారు ఎమ్మెల్యే, సనుకూలంగా స్పందించి సమస్యలను తీర్చేందుకు మున్సిపాలిటీ సంబంధిత అధికారులకు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో స్థానిక వార్డ్ నాయకులు నవీన్, హనీఫ్, బుల్లెట్ మెహబూబ్, శ్రీను, షైక్ షా, దావూద్ వైస్సార్సీపీ వార్డ్ ముఖ్య నాయకులు, కన్వీనర్లు, ఆర్.పిలు, సచివాలయం సిబ్బంది, అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహా పాదయాత్రలో కార్మిక వర్గం

# అగ్ర భాగాన ఉంది నడిపించాలి

- సీఐటీయూ పిలుపు

కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్ : సిఐటియు న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో ఐటీసీ కంపెనీ దగ్గర ఉన్న హమాలీ యూనియన్ జనరల్ బాడీసమావేశం జరిగింది. ఈ సమావేశానికి హమాలి యూనియన్ కార్యదర్శి సి.మారెన్న అధ్యక్షత వహించడం జరిగింది. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు న్యూ సిటీ నగర కార్యదర్శి సి.హెచ్ సాయిబాబా గార్లు సమావేశానికి హాజరైనటువంటి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సిపిఎం పార్టీ కర్నూలుజిల్లా సమగ్ర అభివద్ధికై మహా పాదయాత్రను చేపట్టింది. జూలై నెల 26 నుండి 31 వ తేదీ వరకు ఆదోని నుండి పాదయాత్ర ప్రారంభమై గ్రామాలలో, పట్టణాలలో ప్రజలను కలుసుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకుపోవడం. కోసం, వెనకబడిన కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం తక్షణమే చేపట్టి సాగునీరు, త్రాగునీరు అందించాలని, ప్రతి మండలానికి ఒక డిగ్రీ కాలేజీ, ఇంటర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో ప్రాథమిక మరియు హై స్కూలు ఏర్పాటు చేయాలని, ఉపాధిహామీపథకంద్వారాసంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి,రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, జిల్లాలో చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, కర్నూలు జిల్లాకు తలమానికంగా ఉన్నటు వంటి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను నిమ్స్ తరహాలో అభివద్ధి చేయాలని, ప్రభుత్వ యూనివర్సిటీల్లో లెక్చరర్స్‌ను స్టాఫ్ నుభర్తీ చేసి యూనివర్సిటీల అభివద్ధికి నిధులు కేటాయించాలని, జిల్లాలో రోడ్లన్నీ కూడా గుంతల మాయమై శిథిలావస్థకు చేరుకున్న రోడ్లన్నీ మరమ్మత్తులు చేసి కొత్త రోడ్లు నిర్మించి ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరకల్పించాలని కర్నూలు జిలా సమగ్ర అభివద్ధి కొరకు పదివేల కోట్ల నిధులను కేటాయించాలని సిపిఎం పార్టీ మహా పాదయాత్రను చేపట్టింది. ఈ పాదయాత్రలో అన్ని రంగాలకు సంబంధించిన కార్మికవర్గం అగ్రభాగాన ఉండి ఈ మహాపాదయాత్రలను విజయవంతంచేయవలసిన అవసరం ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఎజెండాను ముందు పెట్టుకుని ఓటు రాజకీయాలు చేస్తున్నాయి. విద్య, వైద్యము, ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి, రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించడం వంటి ముఖ్యమై నటుటి విషయాలను పక్కనపెట్టి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఈ పాలకులకు బుది చెప్పాలని, ప్రజలను చైతన్యం చేసి పోరాటం వైపు నడిపించి ప్రభుత్వం మెడలు వంచి ఈ జిల్లా అభివద్ధికీ పదివేల కోట్ల నిధులు కేటాయించే విధంగా చేయడం కోసం సిపిఎం పార్టీ పాదయాత్రను చేపట్టింది. దున్నపోతు నిద్రమత్తులో ఉన్నటువంటి ఈ ప్రభుత్వానికి ముళ్ళకర్రతో నిద్ర లేపవలసిన అవసరం ఉన్నది. మన పాదయాత్ర లో కార్మిక, కర్షక, అన్ని రకాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. జూలై 31వ తేదీ న కలెక్టరేట్ ముందు కర్నూలు జిల్లా సమగ్ర అభివద్ధికై జరిగే మహాధర్నాలో వేలాదిగా ప్రజలుతరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు బి.మధు మహబూబ్బాషా, కోటేశ్వర్,నాగేంద్ర, మౌలాలి, పాల్గొన్నారు.



## నేడు వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం, స్పందన

- జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్

నంద్యాల, జులై 09, మనం న్యూస్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో ''జగనన్నకు చెబుదాం - స్పందన'' కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.మన జీర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి జులై 10వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధి కారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యధాతథంగా ''జగనన్నకు చెబుదాం-స్పందన'' కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఫుట్‌బాల్ విజేత రిడ్జ్ స్కూల్ జట్టు

- ముగిసిన నవాబ్ అలఫ్ ఖాన్ స్మారక
- ఫుట్‌బాల్ పోటీలు



కర్నూలు సిటీ, జులై 09, మనం న్యూస్: ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన అంతర్ పాఠశాలల ఫుట్బాల్ పోటీల్లో రిడ్జ్ స్కూలు జట్టు విన్నర్ స్థానం సంపాదించగా అతెన స్కూలు జట్టు రన్నర్ స్థానం నిలిచి కప్పులను కైవసం చేసుకున్నాయి. కాగా మూడో స్థానం ఏనుగు మరి జడ్పీ స్కూల్ కు దక్కింది. ఫుట్బాల్ ఫైనల్ పోటీల్లో రెడ్జ స్కూల్ జట్టు 3-0 గోల్స్ తో కొనసాగింది. అట ముగిసేసరికి 4-0 గోల్స్ అధిగతతో మొదటి స్థానం కైవశం చేసుకుంది. ముగింపు కార్యక్రమంలో విజేతలకు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, బెటర్న్ పుట్ బాలర్ భువనాండం కలిసి కప్పులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, సీనియర్ వెటర్న్ పుట్బాల్ క్రీడాకారులు మల్లికార్జున సిహెచ్ చిట్టిబాబు వై. శ్రీనివాసులు, వై. శ్రీనివాసులు, బుధవారం పేట రామాంజనేయులు, హుస్సేన్, ఆరిఫ్, డీఎస్సీ పుట్బాల్ కోచ్ ఎం ఎన్ వి రాజు, నారాయణ, సుధాకర్, మహేష్ పాల్గొనగా పోటీల నిర్వాహకుడిగా పోలీస్ పుట్బాల్ కోచ్ విజయకుమార్ వ్యవహరించి విజయవంతం చేశారు.

## నోట్లోకి గాలం ఇరుక్కుపోయి తల్లడిల్లిన చిన్నారి



మదనపల్లి క్రైమ్, జులై 9, మనం న్యూస్ : నోట్లోకి గాలం ఇరుక్కుపోయి ఓ చిన్నారి తల్లడిల్లిన సంఘటన ఆదివారం రామసముద్రంలో చోటు చేసుకుంది. బాధిత చిన్నారి తల్లి దండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. రామ సముద్రానికి చెందిన దంపతులు గంగాధర్, సుజాతల కుమారుడు ధనుష్(6) గ్రామంలోని చిన్న పిల్లలతో కలిసి ఊరికి సమీపంలో ఉన్న కుంటకు చేపల వేటకు వెళ్లారు. చేపల వేట ఆడుతుండగా చిన్నపిల్లలు చేపల కోసం గాళాలు నీటిలోకి విసరే సమయంలో ప్రమాదవశాత్తు ధనుష్ నోటిలోనికి చేపల గాలం వెళ్ళిపోయి దవడలో ఇరుక్కుపోయింది. బాలుని కేకలు విన్న స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం అతన్ని మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో పాటు నోటిలో ఇరుక్కున్న గాలాన్ని డాక్టర్లు, ఎంఎన్ఓ రామానుజులు చాకచక్యంగా బయటకు తీసి బాలునికి చికిత్సలు అందించారు.

# పాకిస్థాన్ బౌలింగ్ హీరోలు..

## ఓటమి ఖాయమని అనుకున్న టైమ్‌లో కూడా గెలుపు రుచి చూపించిన ధీరులు వీళ్లే!




ఏమాటకు ఆ మాటే చెప్పుకోవాలి. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లలో పాకిస్థాన్ కూడా ఒకటి. అటు బెంబేలెత్తించే బ్యాటర్లు, ఇటు బౌలర్లతో ఆ జట్టు ఎప్పుడూ సమతూకంగా ఉంటుంది. టెస్టు, వన్డే, టీ20.. మూడు ఫార్మాట్లలోనూ దానికి చక్కని రికార్డులున్నాయి. ఒకప్పుడు ఆ జట్టులో ప్రపంచ దిగ్గజ బౌలర్లు ఇమ్రాన్ఖాన్, వాసిం అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్, ఉమర్గుల్ వంటివారితో జట్టు పటిష్టంగా ఉండేది. జట్టు కష్టాల్లో కూరుకుపోయి పరాజయం ఖాయమని నిర్ణయమైపోయిన తర్వాత కూడా జట్టును ఒంటిచేత్తో గెలిపించిన సందర్భాలు అనేకం. మరి ఒక్కసారి ఆ మ్యాచ్లపై ఓ లుక్కేద్దామా!

### ఆస్ట్రేలియాపై చెలరేగిన షోయబ్

మెన్ ఇన్ గ్రీన్ ఒకసారి మూడు మ్యాచ్ల వన్డే సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించింది. చివరి మ్యాచ్కు ముందు రెండు జట్లు 1-1తో సమానంగా ఉన్నాయి. సిరీస్ ఫలితం తేల్చే తుది మ్యాచ్లో పాకిస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఆ మ్యాచ్లో ఆస్ట్రేలియాకు షోయబ్ అక్తర్ చుక్కలు చూపించాడు. 8 ఓవర్లు వేసి 25 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీసుకుని ఆసీస్ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఫలితంగా ఆ మ్యాచ్లో పాక్ 91 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి 2-1తో సిరీస్ను సొంతం చేసుకుంది.

### వాసం అక్రమ్ ఆల్‌రౌండర్ ప్రతిభ

అది 1992 ప్రపంచకప్. ఈ టోర్నీలో వాసం అక్రమ్ అద్వితీయ ఆటతీరుతో ఇరగదీసి పాకిస్థాన్ జట్టుకు విలువైన ఆటగాడిగా మారాడు. ముఖ్యంగా ఫైనల్లో అక్రమ్ అదరహో అనిపించాడు. ఇంగ్లండ్తో జరిగిన ఆ మ్యాచ్లో 18 బంతుల్లో 33 పరుగులు చేసిన అక్రమ్.. ఆ తర్వాత గేమ్ చేంజర్ స్పెల్తో జట్టుకు చరిత్రాత్మక విజయాన్ని అందించాడు. జట్టును విజయం దిశగా నడిపిస్తూ పరుగులు పిండేసుకుంటున్న అలన్లాంబ్ సహా ముగ్గురిని పెవిలియన్ పంపి విజయాన్ని వారి చేతుల్లో నుంచి లాగేసుకున్నాడు. ఇంగ్లండ్ను 22 పరుగులతో ఓడించిన పాకిస్థాన్ తొలిసారి ప్రపంచకప్పు ముద్దాడింది.

### భారత్ టాపార్డర్‌ను కూల్చిన షహీన్ అఫ్రిది

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కలవరపెట్టిన తర్వాత 2020 వరల్ కప్పు 2021లో నిర్వహించారు. వాస్తవానికి అది ఇండియాలోనే జరగాల్సి ఉండగా దుబాయ్లో నిర్వహించారు. తొలి మ్యాచ్లోనే చిరకాల ప్రత్యర్థులైన భారత్-పాకిస్థాన్ మధ్య జరిగింది. ప్రపంచకప్లో ఇండియాపై పాకిస్థాన్ అప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవకపోవడంతో ఈ మ్యాచ్లో ఏం జరుగుతుందోనన్న ఆసక్తితో ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురు చూసింది. పాక్ బౌలర్ షహీన్ అఫ్రిది బెస్ట్ స్పెల్తో టీమిండియా టాపార్డర్ను కుప్పకూల్చాడు. పాక్ ఈజీ విక్టరీ సాధించి ప్రపంచకప్లో భారత్‌పై గెలవలేమన్న అపోహను తొలగించుకుంది.

### న్యూజిలాండ్ ఓటమిని శాసించిన హరీశ్ రవూఫ్

2021 టీ20 ప్రపంచకప్లో న్యూజిలాండ్తో జరిగిన మ్యాచ్లో పాక్ బౌలింగ్ చిచ్చరపిడుగు హరీశ్ రవూఫ్ చెలరేగిపోయాడు. టాస్ గెలిచి కివీస్కు బ్యాటింగ్ అప్పగించిన పాక్.. హరీశ్ పుణ్యమా అని కివీస్ను 134/8 కే కట్టడిచేసింది. నిప్పులు చెరిగే బంతులు విసిరిన హరీశ్ 22 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్లో విజయం సాధించిన పాక్ సెమీస్లోకి ప్రవేశించింది.

### భారత్‌ను గడగడలాండిచిన ఆమిర్

2017లో భారత్‌తో జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో మొహమ్మద్ ఆమిర్ నిప్పులు చెరిగాడు. ఓవల్లో జరిగిన ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 338 పరుగుల భారీ స్కోరు సాధించింది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాకు అది పెద్ద స్కోరు కానప్పటికీ ఆమిర్ బంతితో నిప్పులు చెరిగి భారత బ్యాటింగ్ ఆర్డర్ను కుప్పకూల్చాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శిఖర్ ధవన్లను వెంటవెంటనే వెనక్కి పంపి టీమిండియా పరాజయాన్ని శాసించాడు. ఫలితంగా 2017 చాంపియన్స్ ట్రోఫీ విజేతగా అవతరించింది. వీరే కాకుండా సౌతాఫ్రికా పర్యటనలో ఓ టీ20 మ్యాచ్ ఉమర్గిల్ ఆరు పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు తీసుకుని జట్టుకు విజ యాన్ని కట్టబెట్టగా, 2017లో శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్లో హసన్ అలీ 34 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకుని విజయంలో కీలకపాత్ర పోషిం చాడు. 2001 నాట్వెస్ట్ ముక్కోణపు సిరీస్లో భాగంగా ఇంగ్లండ్తో జరిగిన మ్యాచ్లో వకార్ యూనిస్ 36 పరుగులిచ్చి ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించాడు. 1987లో ఇంగ్లండ్ పర్యటనలో ఇమ్రాన్ ఖాన్ ఇరగదీశాడు. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసుకున్న ఇమ్రాన్, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులిచ్చి ఏడు వికెట్లు తీసుకుని ఇంగ్లిష్ జట్టు పరా జయాన్ని శాసించాడు. 2013లో విండీస్‌లో పర్యటించిన మెన్ ఇన్ గ్రీన్ జట్టు షాహిద్ అఫ్రిది పుణ్యమా అని తొలి వన్డేలో తిరుగులేని విజయం సాధించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాక్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పో య 224 పరుగులు చేయగా, ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన కరీబి యన్ జట్టుకు షాహిద్ అఫ్రిది చుక్కలు చూపించాడు. బ్యాటింగులో 76 పరుగులు చేసిన అఫ్రిది.. బౌలింగులో 12 పరుగులు మాత్రమే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా విండీస్ 41 ఓవర్లలో 98 పరుగులకే చాపచుట్టేసింది. ఈ మ్యాచ్‌తోపాటు సిరీస్‌ను కూడా పాక్ సొంతం చేసుకుంది.

# టెస్టుల్లో ఇంగ్లండ్ స్టార్ రికార్డు..

ఇంగ్లండ్ విధ్వంసక ఆటగాడు హ్యారీ బ్రూక్ టెస్టుల్లో సంచలనం సృష్టించాడు. ఈ ఫార్మాట్‌ల తక్కువ బంతుల్లో వేగంగా వెయ్యి పరుగులు చేసిన క్రికెటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో అతను ఈ ఫీట్ సాధించాడు. 24 ఏళ్ల బ్రూక్ 1,058 బంతుల్లోనే ఈ ఘనత సొంతం చేసుకోవడం విశేషం. పదో టెస్టు ఆడుతున్న బ్రూక్ 16వ ఇన్నింగ్స్‌లో 1,000 పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. అయితే.. మ్యాచ్‌ల పరంగా చూస్తే ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్మన్ వేగంగా వెయ్యి పరుగులు బాదాడు. అతను 7 టెస్టుల్లోనే వెయ్యి క్లబ్‌లో చేరాడు.

**చిరస్మరణీయ ఇన్నింగ్స్**

యాషెస్ మూడో టెస్టులో బ్రూక్(75) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. 251 లక్ష్య ఛేదనలో నాలుగో రోజు తొలి సెషన్లోనే ఇంగ్లండ్ 4 వికెట్లు కోల్పోయింది. అయితే.. జో రూట్(21), బెన్ స్టోక్స్(13), జానీ బెయిర్ స్టో(5)తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఒత్తిడిలోనూ బౌండరీలతో చెలరేగుతూ అర్ధ సెంచరీ సాధించాడు. క్రిస్ వోక్స్(26 బ్యాటింగ్)తో కలిసి ఇంగ్లండును విజయం దిశగా నడిపించాడు. అయితే.. మిచెల్ స్టార్క్ ఓవర్‌లో కమిన్స్ చేతికి చిక్కి వెనుదిరిగాడు. దాంతో, 230 వద్ద ఆతిథ్య జట్టు ఏడో వికెట్ కోల్పోయింది. బ్రూక్ ఔటయ్యాక క్రిస్ వోక్స్(32 నాటౌట్), మార్క్ వుడ్(16 నాటౌట్), మరో వికెట్ పడకుండా ఆడి జట్టును గెలిపించారు. దాంతో, ఇంగ్లండ్ 1-2తో సిరీస్‌లో నిలిచింది.







# యాక్షన్ అవతార్‌లో త్రిష..

## ఇంతకీ ఏ సినిమా కోసమో తెలుసా..?

ఈ ఏడాది మణిరత్నం భారీ ప్రాజెక్ట్ పొన్నియన్ సెల్వన్ 2తో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది చెన్నై భామ త్రిషా కృష్ణన్. ఓ వైపు గ్లామరస్ పాత్రల్లో అందాలు ఆరబోస్తూనే.. మరోవైపు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్‌లో కనిపిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. బ్యాక్ టు బ్యాక్ లీడింగ్ సినిమాల్లో నటిస్తూ కొత్త హీరోయిన్లకు గట్టి పోటీనే ఇస్తుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం విజయ్, లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న లియోలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే ఇటీవలే మరో సినిమాకు కూడా సంతకం చేసింది. త్రిష గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తాజా మలయాళ సినిమా ఐడెంటిటీ టోవినో థామస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి అఖిల్ పాల్, అనస్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజా టాక్ ప్రకారం త్రిష సెప్టెంబర్‌లో ఈ మూవీ సెట్స్‌లో జాయిన్ కానుంది. అంతేకాదు ఈ ప్రాజెక్ట్ కోసం 45 రోజులు డేట్స్ ఇచ్చింది. ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతుండట.. త్రిష ఈ యాక్షన్ పార్టులో భాగం కానుందని ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్రిష టీం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు కల్యాణ్ కృష్ణ, మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త సినిమాలో ఫీ మేల్ లీడ్ కోసం త్రిష పేరును పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఇదే నిజమైతే స్టాలిన్ తర్వాత త్రిష-చిరంజీవి కాంబోలో రాబోతున్న రెండో సినిమా కానుంది. గోల్ బాక్స్ ఎంటర్‌టైనర్‌పై సుస్మిత కొణిదెల నిర్మించబోతున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

మనం సినిమా
manamcinema

# నాని 30పై అప్‌డేట్ రెడీనా..?



దసరాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు న్యాచురల్ స్టార్ నాని. ఈ హీరో కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం నాని 30. డెబ్యూ డైరెక్టర్ శౌర్యువ్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నాడు. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రంలో సీతారామం ఫేం మృణాళ్ ఠాకూర్ ఫీ మేల్ లీడ్ రోల్లో నటిస్తోంది. చాలా రోజుల తర్వాత ట్వీట్ ద్వారా నాని 30 అప్డేట్ అందించాడు నాని. రెడీనా..? అని నాని ట్వీట్ చేస్తూ.. సిల్వర్ స్క్రీన్‌పై వైరా ఎంటర్టైన్‌మెంట్స్ డిస్ ప్లే అవుతున్న స్టిల్ స్క్రీన్ షాట్ను షేర్ చేశాడు. దీంతో నాని త్వరలోనే నాని 30 ఫస్ట్ లుక్ పోస్టర్ కానీ లేదా టీజర్ కానీ లాంఛ్ చేయబోతున్నాడంటూ చర్చించుకోవడం మొదలుపెట్టారు సినీ జనాలు. నాని 30 అనౌన్స్మెంట్ సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ వీడియో ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో నాని కూతురిగా బేబి కైరా ఖన్నా నటిస్తోంది. ఈ మూవీని వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై మోహన్ చెరుకూరి , డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాని 30 చిత్రానికి సను జాన్ వర్గీస్ ఐఎస్సీ కెమెరామెన్. జెర్సీ, శ్యామ్ సింగరాయ్ సినిమాల తర్వాత కెమెరామెన్ సను జాన్ వర్గీస్ ఐఎస్సీ నానితో చేస్తున్న మూడో సినిమా కావడం విశేషం. ఈ చిత్రానికి మలయాళం కంపోజర్, హృదయం ఫేం హెశమ్ అబ్దుల్ వహబ్ సంగీతం అందిస్తున్నాడు. నాని 30 చిత్రానికి ప్రవీణ్ ఆంటోనీ ఎడిటర్ కాగా.. జోతిష్ శంకర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నాడు. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని గోవా, ముంబైతోపాటు పలు లొకేషన్లలో షూట్ చేస్తున్నారు.

# నేడే డబుల్ ఇస్మార్ట్ అప్‌డేట్

## పూరీ-ఛార్మీ టీం సస్పెన్స్




టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, రామ్ కాంబోలో బ్లాక్ బస్టర్ మూవీ ఇస్మార్ట్ శంకర్. బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించిన ఈ చిత్రానికి సీక్వెల్ వస్తుందని ప్రత్యేకించి చెప్పవనసరం లేదు. ఈ మూవీకి డబుల్ ఇస్మార్ట్ టైటిల్ను ఫిక్స్ చేశారు. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రాబోతున్నట్టు పూరీ కనెక్ట్స్ బ్యానర్ ఇప్పటికే అప్డేట్ ఇచ్చేసింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 2024 మార్చి 8న విడుదల చేస్తున్నట్టు కూడా ప్రకటించేసింది. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించి స్ట్రైకింగ్ అప్డేట్‌ను నేడు ఉదయం 11:11 గంటలకు ఇవ్వబోతున్నట్టు మేకర్స్ తెలియజేశారు. ఇస్మార్ట్ ఈజ్ బ్యాక్.. ఈ సారి డబుల్ ఇంపాక్ట్.. అని ట్వీట్ చేశారు మేకర్స్. ఇంతకీ నేడు పూరీ అండ్ ఛార్మీ టీం ఇవ్వబోయే అప్డేట్ ఏమై ఉంటుందా..? అనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. శక్తిమంతమైన త్రిశూలం.. బ్యాక్ డ్రాప్లో మంటలు కనిపిస్తున్న లుక్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోండగా.. లైగర్ లాంటి భారీ డిజాస్టర్ తర్వాత డబుల్ ఇస్మార్ట్‌తో మళ్లీ ఫాంలోకి రావాలని కసిగా ఎదురుచూస్తున్నాడని ఈ స్టిల్ చూసిన మూవీ లవర్స్ తెగ చర్చించుకుంటున్నారు. ఇక ఫస్ట్ పార్టును మించి డబుల్ ఎంటర్టైన్ మెంట్ అందింబోతున్నట్టు టైటిల్తోనే క్లారిటీ ఇచ్చేశాడు పూరీ. రామ్ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో స్కంద సినిమాలో నటిస్తున్నాడు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం వినాయకచవితి కానుకగా సెప్టెంబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Akshara Printers, Jana chaitanya Colony, Plot No.47, Tiruchanoor Road, Tirupathi (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.